

నేడే కూటమి సభ


సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

కశింకోట మండలం తాళ్లపాలెంలో నిర్వహణ

- ప్రధాని నరేంద్రమోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు రాక
- సాయంత్రం 5 గంటలకు ప్రారంభం
- విస్తృతంగా ఏర్పాట్లు

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) నిర్వహించనున్న బహిరంగ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించనున్న ఈ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్రమోదీతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. తాళ్లపాలెం సభకు ప్రధాని హాజరుకానున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన కూటమి నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని రాజమహేంద్రవరంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి 4.50 గంటలకు తాళ్లపాలెం చేరుకుంటారు. అక్కడ నుంచి బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకొని ప్రసంగిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకొని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్ వెళ్లనున్నారు.


సభా ప్రాంగణానికి వెళ్లే మార్గంలో తెలుగుదేశం పార్టీ జెండాల అలంకరణ

సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

తాళ్లపాలెంలో జాతీయ రహదారికి సమీపంలో సుమారు 80 ఎకరాల లేఅవుట్ స్థలాన్ని ప్రధాని మోదీ, చంద్రబాబు సభ కోసం సిద్ధం చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర పోలీసు బలగాలు ఇప్పటికే సభా ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అలాగే పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసింది. తాళ్లపాలెంలో సభా ప్రాంగణం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒకవైపు ... మిగతా 4వ పేజీలో

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమే...



జగన్ ఐదేళ్ల పాలనలో అంగుళం కూడా కదలని సుజల స్రవంతి ప్రాజెక్టు


సుజల స్రవంతి తొలిదశ పనులకు 2018 నవంబరు 15న చోడవరంలో శంకుస్థాపన చేస్తున్న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు (ఫైల్ ఫొటో)

ప్రాజెక్టుపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం

- మొదటి దశ పనులకు రూ.2,022 కోట్లు అవసరం
- టీడీపీ హయాంలో టెండర్ల ప్రక్రియ పూర్తి
- కాంట్రాక్టర్‌కు రూ.12.8 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్స్
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిన పనులు
- బడ్జెట్‌లో ఏటా అరకొరగా నిధుల కేటాయింపు
- ఒక్కరూపాయి కూడా విడుదల చేయని వైనం
- గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్లు పెండింగ్
- నిధుల కొరతతో ముందుకు సాగని భూ సేకరణ ప్రక్రియ
- ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం

(విశాఖపట్నం, అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించేలా రూపొందించిన 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు'కు గ్రహణం పట్టింది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో పనుల్లో ఎటువంటి కదలిక లేదు. ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్న పాలకులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదు. కనీసం గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు కూడా క్లియర్ చేయలేదు.


ప్రాజెక్టు ప్రణాళిక

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 46 మండలాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 1,200 గ్రామాలకు తాగునీరు అందించే ఉద్దేశంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి రూపకల్పన చేశారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పేరుతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భూముల విలువ, నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీలు పెరగడంతో దశాబ్దకాలంలో రూ.7,214 కోట్ల నుంచి రూ.16,568 కోట్లకు చేరింది. ఇందులో తొలిదశ పనులు రూ.2022.2 కోట్లతో చేపట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం 2017 సెప్టెంబరు ఐదో తేదీన జీవో నంబర్ 53 ప్రకారం పరిపాలనా అనుమతి మంజూరుచేసింది. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం... 2021లో ప్రాజెక్టు అంచనాను రూ.17,050.2 కోట్లకు పెంచుతూ పాలనామోదం ఇచ్చింది తప్ప... ... మిగతా 4వ పేజీలో


అనకాపల్లి జిల్లా రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల సరిహద్దులో పెదపూడి రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం (ఫైల్)

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రారంభం

ఓటు కోసం క్యూ


ఏయూలో ఆదివారం ఓటు వేసేందుకు బారులుతీరిన ఉద్యోగులు

- ఏయూ హైస్కూళ్లలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఇక్కడ పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు కలిగిన వారికి ప్రత్యేక కౌంటర్లు
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అభ్యర్థులు
- ఏయూ అవుట్‌గేటు పరిసరాల్లో అధికార పార్టీ ప్రలోభాలు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. చిన్నచిన్న ఘటనలు తప్ప తొలిరోజు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే సాధారణ పోలింగ్‌కు భిన్నంగా పోస్టల్ బ్యాలెట్‌కు ఎక్కువ సమయం పట్టింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు, ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలల్లో ఉద్యోగుల ఓటింగ్‌కు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది.

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు వేర్వేరుగా, జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాలో ఓటు ఉన్న వారి కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉద్యోగులకు ఆదివారం నుంచి వరుసగా రెండు రోజులు, ఏడో తేదీ నుంచి రెండు రోజులపాటు పోలీసులకు అవకాశం ఇచ్చారు. తొలి రోజు ఓటు వేసేందుకు ఉదయం 8.30 గంటలకే ఉద్యోగులు ఏయూ హైస్కూలు ప్రాంగణానికి వచ్చేశారు. పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు రెండో విడత ర్యాండమైజేషన్ శిక్షణ ఆదివారం ప్రారంభించారు. ఈ శిక్షణకు హాజరైన ఉద్యోగులు ఓటింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ దక్షిణ, విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు 11,500 మంది ఓటర్లు ఉండగా, జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు ఉన్నవారు సుమారు 5,500 మంది ఉన్నారు.



ఓటు వేయడానికి సగటున నాలుగు నిమిషాలు

పోస్టల్ బ్యాలెట్ వేయడానికి సగటున నాలుగు నిమిషాలు సమయం పడుతుంది. అందునా ప్రతి ఒక్కరూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వేర్వేరుగా ఓట్లు వేయాల్సి ఉన్నందున మొత్తం ఎనిమిది నిమిషాల సమయం పడుతుందని పలువురు ఉద్యోగులు వివరించారు. బ్యాలెట్ పేపర్ తీసుకుని ఓటు వేసి ఒక కవర్‌లో పెట్టాలి. తరువాత ఆ కవర్, డిక్లరేషన్ ఫారంను మరో పెద్ద కవర్‌లో పెట్టి బాక్సులో వేయాలి. అందువల్ల ఎక్కువ సమయం పడుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. దీనివల్ల సాధారణ ఓటింగ్‌కు భిన్నంగా పోస్టల్ ఓటింగ్‌కు జాప్యం జరుగుతుందని ఒక అధికారి వివరించారు. కాగా ఆదివారం ఉదయం 8.30 గంటలకే ఎక్కువ మంది ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం ... మిగతా 4వ పేజీలో

రూ.550 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి



మరో రూ.2,500 కోట్లు పథకాల రూపేణా ప్రజలకు పంపిణీ చేశాం

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- భీమిలిలో తాగునీటి సమస్య నివారణకు రూ.10 కోట్లతో పైప్‌లైన్ నిర్మాణం
- ఆనందపురం మండలంలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం 1500 ఎకరాలు సేకరణ
- స్థానికులకు ఉపాధి కల్పిస్తాం
- రూ.500 కోట్లతో నియోజకవర్గం అంతా యూజీడీ
- నియోజకవర్గమే నాకు దేవాలయం
- 'ఆంధ్రజ్యోతి'లో భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అవంతి' అనేది ఆయన ఏర్పాటుచేసిన విద్యా సంస్థల పేరు. దానినే ఇంటిపేరుగా మార్చుకొని పాపులర్ అయ్యారు ముత్తంశెట్టి శ్రీనివాసరావు. ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తొలిసారి 2009లో భీమిలిలో పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తరువాత 2014 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి గెలిచారు.


ముత్తంశెట్టి శ్రీనివాసరావు

2019 ఎన్నికల్లో మళ్లీ భీమిలి నుంచి వైసీపీ తరపున పోటీ చేసి రెండోసారి గెలిచారు. దాంతో ఆయనకు మంత్రి పదవి లభించింది. పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు మళ్లీ భీమిలి నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. ఇప్పటివరకూ నియోజక వర్గానికి ... మిగతా 4వ పేజీలో


కేంద్రీయ విద్యాలయంలో నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థినిని తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా నీట్

- 97.5 శాతం హాజరు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని 13 కేంద్రాల్లో ఎనిమిది వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 7,800 మంది (97.5 శాతం) హాజరయ్యారు. పరీక్ష రాసేందుకు ఉదయం 11.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. అయితే అభ్యర్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మాత్రం ఎండ తీవ్రతకు గురయ్యారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించేందుకు సిటీ కో-ఆర్డినేటర్ ఈశ్వరీ ప్రభాకర్ పలు కేంద్రాలు తనిఖీ చేశారు.

వైసీపీ గిమ్మిక్కులు!

- ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించుకునేందుకు పాట్లు
- సోషల్ మీడియాలో లోకల్ స్టార్స్‌తో ఒప్పందాలు
- ఓటు ఎవరికి వేయబోతున్నారంటూ ప్రజల నాడి తెలుసుకుంటున్నట్టు వీడియోలు
- ముందుగా తర్ఫీదు ఇచ్చి.... అనుకోకుండా కలిసినట్టు కలరింగ్



- వైసీపీ అభ్యర్థులకు ప్రజల్లో ఆదరణ ఉన్నట్టు షో
- వాటిని తమ ఖాతాల నుంచి అప్‌లోడ్
- అధికార పార్టీ ట్రిక్స్ చూసి నవ్వుకుంటున్న యువత

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ పాలన పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు నానా పాట్లు పడుతున్నారు. ఇందుకు రోజుకొక వ్యూహం అమలు చేస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్ వంటి సోషల్ మీడియా ఖాతాల్లో 15 వేలకు మించి ఫాలోవర్లు ఉన్న లోకల్ స్టార్స్‌ను గుర్తించి వారి సేవలను తమ అభ్యర్థులకు అనుకూలంగా వాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లను కలిగి తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు ఆసక్తి చూపే వారితో ఎంతో కొంత ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారు. వైసీపీ నేతలతో ఒప్పందం కుదుర్చుకున్న సోషల్ మీడియా లోకల్ స్టార్‌లు ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల వైపే ప్రజలు ఉన్నారనే అభిప్రాయం కలిగేలా స్కిట్‌లు రూపొందించి వీడియోలు తీస్తున్నారు. స్కిట్‌లో హావభావాలను ఎలా ప్రదర్శించాలనే దానిపై కొంతమందికి తర్ఫీదు ఇచ్చిన తర్వాతే ఇంటర్వ్యూ పేరుతో వీడియో చిత్రీకరిస్తున్నారు. అయితే తాము తర్ఫీదు ఇచ్చిన వారిని ఇంటర్వ్యూ చేస్తున్నామనే అనుమానం వీడియో చూసిన వారికి రానివిధంగా, ఏదో దారినపోతున్న వారిని ఆపి ఓటు ఎవరికేస్తారనే అభిప్రాయం తీసుకున్నట్టు, మార్కెట్‌కు వెళ్లిన వారిని ఆపి అడిగినట్టు, దుకాణం వద్దకు వచ్చే ప్రజలను, ఉద్యోగానికి వెళ్లేవారిని ఇలా వివిధ వర్గాలకు చెందిన వారిని అప్పటికప్పుడు ఆపి అభిప్రాయం సేకరిస్తున్నామని అనిపించేలా వీడియోలను తీస్తున్నారు. తర్వాత తమదైన శైలిలో వీక్షకులను ఆకట్టుకునేలా మాట్లాడి, ఓటర్ల నాడి వైసీపీ నుంచి పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థికి, ఎమ్మెల్యే అభ్యర్థికి అనుకూలంగా ఉందని పేర్కొంటూ తటస్థ ఓటర్లను, ప్రభుత్వంపై వ్యతిరేక భావంతో ఉన్న ఓటర్లను అధికార పార్టీ అభ్యర్థుల వైపు మరల్చేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, గాజువాక అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు అనుకూలంగా వీడియోలు చేసి తమ ఖాతాల ద్వారా కొంతమంది సోషల్ మీడియా స్టార్‌లు తమ ఖాతా నుంచి అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే యువత, విద్యావంతులు వీటి వెనుక మర్మాన్ని తేలికగానే గుర్తిస్తున్నారు. చివరకు ఎన్నికల ప్రచారానికి వైసీపీ నేతలు కొత్త మార్గాన్ని కనిపెట్టారంటూ నవ్వుకుంటున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

- ఆస్తి నీదే... హక్కులు ఎవరివైనా కావచ్చు
- భూమి హక్కుదారులకు అనేక రకాల ఇబ్బందులు

జన కేతనం

- సామాజిక మాధ్యమం... హోరెత్తుతున్న ప్రచారం 6లో



వంశీకృష్ణకు కొబ్బరితోట వద్ద స్వాగతంపలుకుతున్న మహిళలు



31వ వార్డులో వంశీకృష్ణ సతీమణి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

'సౌత్'ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

» జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

అల్లిపురం, మే 5: రాష్ట్రంలోనే దక్షిణ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చుదిద్దుతానని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రస్తుత నాయకులు పాతనగరాన్ని అభివృద్ధి చేశామని చెబుతున్నా.. అవన్నీ శిలాఫలాకలపైనే నిలిచిపోయాయన్నారు. తనను గెలిపిస్తే ఓల్డ్‌సిటీని గ్రీన్‌సీటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం జీవీఎంసీ 34వార్డు పరిధి లీలామహల్‌రోడ్డు, సాయిబాబావీధి, కెప్టెన్ రామారావు జంక్షన్, కొబ్బరితోట, గీత్ సంగీత్ రోడ్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా శ్రీభరత్ గెలిపించాలన్నారు. ఈ సందర్భంలో వార్డులో పెద్ద ఎత్తున మహిళలు, యువత, వంశీ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రాంకుమార్, పి. రాజేశ్వరి, జనసేన అధ్యక్షుడు నీలంరాజు,వాసుపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 33వార్డు వెంకటేశ్వరమెట్ట, అమ్మవారివీధి, కుమ్మరివీధి ప్రాంతాల్లో ఆదివారం వార్డు కార్పొరేటర్, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులు భీశెట్టి గోపికృష్ణ ఆధ్వర్యంలో బ్యాలట్ నమూనాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

మద్దిలపాలెం: కూటమి పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్ర భవిష్యత్తు మార్చుతుందని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. శివాజీపాలెంలో ఆదివారం ఆయన కార్యాలయంలో మత్స్యకార, యాదవ నాయకులు జనసేన పార్టీలో చేరారు. మత్స్యకార నాయకుడు గరికన వెంకట్, యాదవ నాయకులు ఒమ్మి కిరణ్, సర్దార్‌సింగ్ చిన్నా తదితరులు జనసేనలో చేరిలోఉన్నారు.టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, వాసుపల్లి రాజు పాల్గొన్నారు.

29 వ వార్డులో ప్రచారం..

మహారాణిపేట: వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం మహారాణిపేటలోని 29 వార్డు వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు, తనను, ఎంపీ అభ్యర్థి ఎం శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి..

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించాలని ఆయన సతీమణి పద్మజా కోరారు. ఆదివారం వార్డులోని డాబాగార్డెన్స్, యల్లమ్మతోట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.అపార్ట్‌మెంట్ వాసులంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రూప, గోపి, కనకవల్లి, జనసేన, టీడీపీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ, పక్కన విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్



బైక్ ర్యాలీలో కూటమి శ్రేణులు

కూటమి విజయం తథ్యం ; వంగవీటి రాధాకృష్ణ

» నార్త్ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజుకు మద్దతుగా బైక్ ర్యాలీ

మురళీనగర్, మే 5 ; ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు భద్రతతో కూడిన పాలన అందించాలంటే కూటమి ప్రభుత్వ విజయంతోనే సాధ్యపడుతుందని వంగవీటి రాధాకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు మంచి పాలనను అందించడంలో అనుభవమున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తిరిగి ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విష్ణుకుమార్‌రాజు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా నిర్వహించి మద్దతు ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాధవధార సీతన్నగార్డెన్స్ నుంచి ప్రారంభమైన మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాక్యాంపు ప్రాంతాల మీదుగా సాగింది. అశేష జనం మద్దతుగా ఆరంభమైన బైకు ర్యాలీలో యువకులు ఉత్సాహంగా పార్టీల జెండాలు పట్టుకుని నాయకులకు సంఘీభావం తెలిపారు. ర్యాలీలో ఎంపి అభ్యర్థి భరత్ ఉత్సాహంగా ప్రజలకు అభివాదం చేస్తు కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెన్మెత్స.విష్ణుకుమార్ రాజును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న విష్ణుకుమార్‌రాజు సతీమణి సీతాసుజాత

ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని విష్ణుకుమార్‌రాజు అన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కి పోయిందన్నారు. అవినీతి రహిత పాలనకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. భూ కబ్జాలు, హత్యలు, ప్రతి ఒక్కరిపై మాదక ద్రవ్యాల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, టీడీపీ 50 వ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, 50, 49వవార్డుల కూటమి నాయకులు, పార్టీఅభిమానులు, మహిళలు ఉన్నారు.

విష్ణుకుమార్‌రాజు సతీమణి ప్రచారం

విష్ణుకుమార్ రాజు సతీమణి సీతాసుజాత సీతమ్మధార పరిసరాల్లో ప్రచారం చేశారు. పలు అపార్టుమెంట్‌ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గాన్ని స్మార్ట్ సిటీగా మారుస్తా

జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ పేరుతో నగరంలో కొన్ని ప్రాంతాలనే అభివృద్ధి చేస్తున్నారని, వాటితో సమానంగా ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ చెప్పారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నియోజకవర్గ మేనిఫెస్టోని వంద రూపాయల స్టాంప్ పేపరుపై విడుదల చేశారు. మొత్తం 34 అంశాలతో మేనిఫెస్టో ఇచ్చామని, గెలిచిన తరువాత ప్రతి మూడు నెలలకోసారి ఏమి సాధించామో ప్రజలకు చెబుతామన్నారు. మూత పడిన విశాఖ పోర్టు ఆస్పత్రిని తెరిపిస్తామన్నారు. మోడల్ స్కూళ్లు, జై భారత్ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, పిల్లలకు సాంస్కృతిక కేంద్రం పెడతామన్నారు. కేజీహెచ్‌కు వెళ్లే రోగులకు వార్డులోనే టోకెన్లు ఇచ్చే విధానం అమలుచేస్తామన్నారు. యువతకు ఉపాధి, కెరియర్ గైడెన్స్ కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు.

లక్ష ఉద్యోగాలు ఎన్‌ఆర్‌ఐ టీడీపీ లక్ష్యం

- ఎన్‌ఆర్‌ఐ టీడీపీ హెడ్ రవికుమార్ వేమూరి



విజయచిహ్నం చూపిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

మధురవాడ, మే 5 : రాష్ట్రంలోని యువతకు ఏటా లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్‌ఆర్‌ఐ టీడీపీ హెడ్ డాక్టర్ రవికుమార్ వేమూరి తెలిపారు. మధురవాడ వి. కన్వెన్షన్‌లో ఆదివారం ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూచన మేరకు ఏపీ విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ఏటా లక్ష మందికి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్రపంచంలో 121 దేశాల్లో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ శాఖలు ఉన్నాయని, 27 వేల మంది సభ్యులు ఉన్నారని, 4 వేల మంది పారిశ్రామికవేత్తల అండ తెలుగు విద్యార్థులకు ఉంటుందన్నారు.



ప్రచారంలో కేకే రాజు



కేకే రాజును గజమాలతో సన్మానిస్తున్న వెలమ సంఘ ప్రతినిధులు

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం

» ఉత్తర నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు

సీతమ్మధార, మే 5: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందినట్టు ఉత్తర నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు అన్నారు. శంకరమఠం రోడ్డు ఎదురుగా ఉన్న పద్మశాలి భవన్‌లో పద్మశాలి సంఘం కన్వీనర్ గుద్దే వేణు బ్రదర్స్, భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం, ఉత్తర నియోజకవర్గ పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజుతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతినిధులు గేదే వేణు, తెడ్లపు వెంకటేశ్వరరావు, చిక్కా సత్యనారాయణ, కులపాక సన్యాసిరావు, కర్లం వెంకటేశ్వరరావు పాల్గొని కేకే రాజును సన్మానించారు.సంపంగి శ్రీనివాసరావు, సంఘం పెద్దలుపాల్గొన్నారు.

కేకే రాజుకు మద్దతుగా గ్రామ సంఘాల సమావేశం

అక్కయ్యపాలెం: కేకే రాజుకు మద్దతుగా తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ నాలుగు గ్రామ సంఘాల పెద్దలు ఆదివారం ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేకే రాజు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాము ఆయనకు మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, నాయకులు పీఎల్ఎన్ పట్నాయక్, దాడి శ్రీను, పరదేశమ్మ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. గవర తాటిచెట్లపాలెం సాక్షి గణపతి ఆలయం వద్ద, దర్మానగర్, తిక్కవానిపలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ కేవీఎన్ శశికళ ఆధ్వర్యంలో కేకే రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మార్కెట్ వర్తక సంఘం సభ్యులుతో కె.కె.రాజు సమావేశం

కంచరపాలెం: కంచరపాలెం మార్కెట్ వర్తకం సంఘం సభ్యులతో కేకే రాజు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉదయం వాకర్స్‌తో సమావేశమైన కె.కె.రాజు అభివృద్ధికి ఓటేయాలని కోరారు.

మాధవధార; కేకే రాజు మురళీనగర్‌లో ఆదివారం రాత్రి వైసీపీ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల.వెంకటరావుఆధ్వర్యంలో జరిగిన వెలమల ఆత్మీయ సమావేశం ఆయన పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగన్నాథం, వికెపిసిపిఐఆర్ మాజీ ఛైర్మన్ చొక్కాకుల లక్ష్మి, సీనియరు నాయకులు జివి.రవిరాజు బాపు నాయుడు హాజరయ్యారు. రాజీవ్‌నగర్‌లో దైవ స్వరూపి చర్చి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కేకే రాజు పాల్గొన్నారు. పాదర్ ప్రభుదాసు, 51వవార్డు కార్పొరేటరు రెయ్యివెంకటరమణ, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా.గురువులు, విఎంఆర్డీఏ ఛైర్మన్ సనపల.చంద్రమౌళి, కార్పొరేటర్లు ఉన్నారు.

జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

» రాష్ట్రంలో కూటమికి 160 సీట్లు ఖాయం

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి చరిత్ర సృష్టించబోతున్నదని, 175 స్థానాలకు 160 గెలవనుందని..జూన్ 9న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమికి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని, రాయలసీమలో వైసీపీ కంచుకోటలు సైతం బద్ధలు కానున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉండగా కూటమి 30కి పైగా గెలుచుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కూటమి 'ప్రజాగళం' పేరుతో ప్రకటించిన మేనిఫెస్టోకు అన్నివర్గాల నుంచి విశేషమైన స్పందన కనిపిస్తున్నదన్నారు. కూటమి ప్రకటించిన పథకాల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారంటూ జగన్ ప్రశ్నించడాన్ని గంటా తప్పుబట్టారు. మాడుగుల మండలం తారువాలో దాడికి గురైన బీజేపీ కార్యకర్తను పరామర్శించడానికి అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అక్కడికి వెళితే డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న బూడి ముత్యాలనాయుడు తన అనుచరులతో దాడి చేయించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ భీమిలి ఇన్‌చార్జి రామునాయుడు, జనసేన నాయకుడు ఎస్.శ్రీనివాస్, టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

» సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైసీపీ ఐదేళ్ల పాలన మొత్తం అవినీతిమయంగా మారిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు విశాఖ విచ్చేసిన ఆమె ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర హక్కుల సాధనలో పూర్తిగా విఫలమైందన్నారు. విభజన చట్టంలోని హామీలను పోరాడి సాధించుకోవాలన్న స్పృహ కూడా లేకుండా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు.

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమే...

... 3వ పేజీ తరువాయి

ఇంత వరకూ పైసలు విడుదల చేయలేదు.

పథకం పనితీరు ఇలా

గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం కుడి కాలువకు తరలిస్తుండగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ కాలువకు సరఫరా చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి సమీపంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేసి, అక్కడి నుంచి ఏలేరు జలాశయంలోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి గతంలోనే ఉన్న కాలువ ద్వారా గోదావరి జలాలను విశాఖ ఉక్కు కర్మాగారానికి, విశాఖ ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. కాగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేసి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపూడి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. దీని నుంచి కాలువల ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని వివిధ మండలాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా పథకానికి రూపకల్పన చేశారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ 162.409 కిలోమీటరు వద్ద..అంటే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి 3.4 కి.మీ. పొడవున గ్రావిటీ కెనాల్‌ను అదే మండలంలోని జమాదులపాలెం వరకూ నిర్మించనున్నారు. అక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి ఆరు పంపుల సహాయంతో 31.2 ఎంసీఎఫ్‌టీల నీటిని 53 మీటర్ల ఎత్తుకు ఎత్తి పోస్తారు. అదేవిధంగా తీడ వద్ద ఏర్పాటుచేయనున్న మరో ఎత్తిపోతల పథకం ద్వారా మూడు పంపుల సహాయంతో 50.6 ఎంసీఎఫ్‌టీల నీటిని 52 మీటర్ల ఎత్తుకు తీసుకువెళతారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పంప్ చేసిన నీటిని 14.5 కి.మీ. పొడవున నిర్మించనున్న లీడింగ్ చానల్ ద్వారా బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల సరిహద్దుల్లో నిర్మించ తలపెట్టిన పెదపూడి జలాశయానికి తరలిస్తారు. అక్కడ నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా విశాఖ గ్రామీణ జిల్లాలోని వివిధ మండలాల్లో గల పంట పొలాలకు సరఫరా చేస్తారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. అయితే పనులు ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం...సుజల స్రవంతి ప్రాజెక్టులో కదలిక తీసుకువచ్చింది. తొలిదశలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. 2017 సెప్టెంబరులో రూ.2,022 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. 2018 నవంబరు 15న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిదశ పనులకు చోడవరంలో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. అయితే కాలువ తవ్వకానికి అవసరమైన భూ సేకరణ జరిగేలోపు ఎన్నికలు వచ్చాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అప్పటికి 25 శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టుల కాంట్రాక్టులను రద్దు చేయడంతో సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా ఆ జాబితాలో చేరింది. కొంతకాలం తరువాత పాత కాంట్రాక్టర్‌కే నిర్మాణ పనులు అప్పగించారు. కానీ అధికారులు భూ సేకరణ చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. గడచిన నాలుగేళ్ల నుంచి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబునాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ తప్ప వైసీపీ ప్రభుత్వ ఎటువంటి చెల్లింపులూ జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.17,050.2 కోట్లకు అంచనా సవరణ

రెండేళ్ల క్రితం ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు అంచనాను తాజా రేట్ల మేరకు రూ.17,050.2 కోట్లకు సవరించి ఆమోదించారు. తొలి దశ పనులు రూ.2,022 కోట్లుగానే కొనసాగించడం గమనార్హం. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండు ప్యాకేజీలకు రూ.3,800 కోట్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. భూసేకరణకుగాను అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలు ఏర్పాటుచేశారు. రెండు దశల పనులు చేపట్టాలంటే భూమి అవసరం. మొత్తం ప్రాజెక్టుకు 16,040 ఎకరాలు అవసరం. దీంట్లో విశాఖ జిల్లాలో 393 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాలకుగాను ఇప్పటివరకు 1,157.76 ఎకరాలకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు తప్ప రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించాలంటే తొలుత భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అంటే రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతులకు పరిహారం, పనులు చేపట్టేందుకు కనీసం రూ.నాలుగు వేల కోట్లు విడుదల చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు కోరినా ప్రభుత్వం ఇంతవరకు పైసా విడుదల చేయలేదు.

మొత్తం ఆయకట్టు ప్రాంతం ఎనిమిది లక్షల ఎకరాలు

ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 3.2 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి దశలో అనకాపల్లి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 1.3 లక్షల ఎకరాలకు, రెండో దశలో అనకాపల్లి జిల్లాలో ఆరు మండలాలు, విశాఖ జిల్లాలోని ఒక మండలం పరిధిలో మొత్తం 1.35 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 11 మండలాల్లో 1.33 లక్షల ఎకరాలకు నీరు అందిస్తారు. తరువాత ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఆరు మండలాల్లో 0.85 లక్షల ఎకరాలతోపాటు మిగిలిన రెండు జిల్లాలో మిగిలిన ఆయకట్టును నీరు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఇంకా మూడు జిల్లాల్లో 1200 గ్రామాల్లో ఉండే 30 లక్షల జనాభాకు, పరిశ్రమల అవసరాలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకు గోదావరి నుంచి నుంచి 63 టీఎంసీల వరద నీటిని తరలించాల్సి ఉంటుంది. దీంట్లో సాగునీటి కోసం 54 టీఎంసీలు, తాగునీటి కోసం 4.46 టీఎంసీలు,పరిశ్రమలకు 5.84 టీఎంసీలు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపరిచారు. ఇందుకోసం అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పెదపూడి వద్ద 3.15 టీఎంసీలు,కె.కోటపాడు మండలం భూదేవి వద్ద 6.55 టీఎంసీలు, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వీరనారాయణపురం వద్ద 6.2 టీఎంసీలు, అదే మండలంతాటిపూడి వద్ద 3.8 టీఎంసీల నీరు నిల్వ కోసం జలాశయాలు నిర్మించాల్సి ఉంది.

శాకాహారులను ఎన్నుకుందాం..

డాబాగార్డెన్స్, మే 5 : ఎన్నికల్లో శాకాహారం తీసుకునే అభ్యర్థులను ఎన్నుకోవాలని పిరమిడ పార్టీ ఆఫ్ ఇండియా విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యవాణి పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పిరమిడ్ పార్టీ ఎన్నికల్లో నిర్వహించనున్న కార్యకలాపాలపై పోస్టర్ విడుదల చేశారు.

ఓటు కోసం క్యూ

... 3వ పేజీ తరువాయి

పది గంటలకు పోలింగ్ ప్రారంభం కావల్సి ఉన్నా కొన్నిచోట్ల ఆలస్యమైంది. విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటుచేసిన సెంటర్‌లో ఉదయం 11 గంటల తరువాత పోలింగ్ ప్రారంభం కావడంతో అప్పటికే గంటకుపైగా క్యూలో ఉన్న ఉద్యోగులు అసహనం వ్యక్తంచేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈనెల 7,8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చినా పలువురు ఉద్యోగులకు ఇచ్చిన ఆర్డర్‌లో ఆదివారం నుంచి ఓటేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో భీమిలి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది డ్రైవర్లు, కండక్టర్లు ఓటేయడానికి రాగా, అక్కడ సిబ్బంది తొలుత అంగీకరించలేదు. దీంతో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ జోక్యం చేసుకుని వారందరికీ ఓటేయడానికి అవకాశమిచ్చారు. కొందరి ఉద్యోగుల పేర్లు జాబితాలో కనిపించలేదు. దీనిపై వారందరు ఫిర్యాదు చేయడంలో అప్పటికప్పుడు ఫారం 12 ఇచ్చారు. అయితే అటువంటి వారందరికీ మరోరోజు ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. జిల్లా విద్యాశాఖలో సుమారు 30 మంది ఉద్యోగుల పేర్లు లేకపోవడంతో వారందరికీ తాజాగా ఫారం 12 జారీచేశారు. కలెక్టర్‌మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కెఎస్. విశ్వనాథన్, అన్ని సెగ్మెంట్ల ఆర్వోలు పోలింగ్ తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. కాగా పోలింగ్ ప్రశాంతంగానిర్వహించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

అభ్యర్థుల సందర్శన

అభ్యర్థులు పలువురు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. విశాఖ లోక్‌సభకు టీడీపీ నుంచి పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి జై భారత్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న వీవీ లక్ష్మీనారాయణ, విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తోపాటు కొందరు స్వతంత్రులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఇంకా అభ్యర్థుల తరఫున ఏజెంట్లు వచ్చి పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారు. ఇదిలావుండగా ఏయూ ఇన్‌గేటు నుంచి అవుట్‌గేటు మధ్యన ప్రధాన రహదారిపై పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హడావిడి చేశారు. ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే దారికి ఇరువైపులా చెట్ల కింద ఓటర్ల జాబితాలు పట్టుకుని ప్రలోభాలకు గురిచేసేందుకు యత్నించారు. శనివారం రాత్రి పలువురు ఉద్యోగులకు వైసీపీ నాయకులు స్వయంగా లేదా వారికి అనుకూలంగా సంఘాల ద్వారా తాయిలాలు అందజేశారనే ప్రచారం సాగుతుంది. జిల్లాలో ఓటు హక్కు ఉండి ఇక్కడే పనిచేస్తున్న 11,221 మందికిగాను 3152 మంది తొలిరోజు ఆదివారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న 5389 మందిలో 1136 మంది ఓటేశారు.

రూ.550 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

... 3వ పేజీ తరువాయి

చేసినవి, మళ్లీ గెలిస్తే చేయాలనుకుంటున్నవి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు.

ప్రశ్న: పర్యాటక శాఖా మంత్రిగా ఏమి చేశారు?

జవాబు: అప్పటివరకు పర్యాటక శాఖకు సరైన పాలసీ లేదు. ఇన్వెసర్ ఫ్రెండ్లీ పాలసీని తీసుకువచ్చాము. దానివల్ల భీమిలి పరిసరాల్లో స్టార్ హోటళ్లు, రిసార్ట్స్ నిర్మాణానికి భారీ పెట్టుబడులు వచ్చాయి. అన్నవరంలో రూ.350 కోట్లతో 7 స్టార్ హోటల్ నిర్మాణం మొదలైంది. అలాగే ఓబెరాయ్ గ్రూపు విల్లాల నిర్మాణానికి ముందుకు వచ్చింది. విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు కళాకారులకు కూడా రాష్ట్ర పురస్కారాలను అందించాం. స్పోర్ట్స్‌కి కూడా పాలసీ తీసుకువచ్చాం.

ప్ర: భీమిలి అభివృద్ధికి ఏమి చేశారు?

జ: ప్రతి గామానికి సంక్షేమ పథకాలు అందించాం. ఇలా నియోజకవర్గం అంతా కలిపి రూ.2,500 కోట్లు పథకాల రూపంలో పంపిణీ చేశాము. మరో రూ.550 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాము. మూడు దశాబ్దాలుగా నలుగుతున్న జూట్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం చూపించి కార్మికులకు రూ.36 కోట్లు ఇప్పించాం. దివీస్ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.3 కోట్లతో టి.నగరంపాలెంలో గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాం. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నా నిధులు లేవు. దీనికి కూడా సీఎస్ఆర్ నుంచి రూ.2 కోట్లతో శంకుస్థాపన చేశాం. పాండ్రంకిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరుచేయించాం. అనంత పద్మనాభస్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణం రూ.5 కోట్లతో చేపట్టాం. చివరి దశలో ఉంది. భీమిలి తాగునీటి సమస్య నివారణకు రూ.10 కోట్లతో పైపులైన్ వేయించాం. సాగర్‌నగర్, మంగమారిపేట, ఎస్‌ఓఎస్‌ల వద్ద బీచ్‌లు అభివృద్ధి చేశాం. ఒక్క భీమిలి నియోజకవర్గంలో పది అర్బన్ పీహెచ్‌సీలు పెట్టించాం. పద్మనాభంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుచేశాం. ఈ జూన్‌లోనే అడ్మిషన్లు జరుగుతాయి.

ప్ర: మళ్లీ గెలిస్తే ఏమి చేయాలనుకుంటున్నారు?

జ: భీమిలి గ్రామీణ నియోజకవర్గం. యువతకు ఉపాధి కోసం ఆనందపురం మండలంలో ఏపీఐఐసీ ద్వారా 150 ఎకరాలు సేకరించాం. అందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేసి స్థానికులకు ఉపాధి కల్పిస్తాం. విశాఖ నుంచి భోగాపురం వరకు భీమిలి మీదుగా ఆరు వరుసల రహదారి వేయిస్తాం. దీనివల్ల హైవేలో మధురవాడ వద్ద ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది. మధురవాడ, పీఎంపాలెం, భీమిలి ప్రాంతాల్లో రూ.500 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తాం. సీఎస్ఆర్ నిధులతో చంద్రపాలెం వద్ద జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. ఫ్లైఓవర్లు కూడా కడతాం. పరిపాలనా రాజధానిలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తాం.

ప్ర: భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ హామీ ఏమైంది?

జ: రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరుచేసింది. సీఎం జగన్ శంకుస్థాపన కూడా చేశారు. టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి.

ప్ర: మీకు కోపం ఎక్కువట?

జ: నియోజకవర్గంలో ప్రతి కుటుంబంతో పరిచయం ఉంది. అవంతి దగ్గరకు వెళితే ఇబ్బంది పెట్టకుండా సమస్య తెలుసుకొని సాయం చేస్తారనే పేరు ఉంది. దైవభక్తి, పాపభీతి ఉన్నాయి. నిజాయితీగా ఉంటాను కాబట్టే కోపం వస్తుంది. అది ఆ కొద్దిసేపే. జీవితం అనేది రంగస్థలం లాంటిది. ఎవరి పాత్ర వారు పోషించి వెళ్లిపోవలసిందే.

ప్ర: మళ్లీ పోటీ చేయడానికి కారణం?

జ: భగవంతుడు ఆశించిన దాని కంటే ఎక్కువే ఇచ్చాడు. పదవులు అడ్డం పెట్టుకొని మరింత సంపాదించాలనే యావ లేదు. శక్తి మేరకు ప్రజలకు సేవ చేయాలనేది సంకల్పం. ఐదు లక్షల మందికి విద్యాబుద్ధులు నేర్పించాం. వేలాది మందికి ఉపాధి కల్పించా. తల్లిదండ్రుల తరువాత అధికంగా ఇష్టపడేది భీమిలినే. నియోజకవర్గమే నాకు దేవాలయం. మానవ సేవే..మాధవ సేవ. అందుకే మళ్లీ పోటీ.

ప్ర: మిత్రుడు గంటాతో పోటీపై మీ అభిప్రాయం?

జ: ముందు నుంచి భీమిలిలో నేనే ఉన్నా. 2009లో గెలిచా. 2014లో నన్ను ఎంపీగా పంపించి ఆయన పోటీ చేసి గెలిచారు. 2019లో మళ్లీ నేనే భీమిలిలో విజయం సాధించా. ఈసారి కూడా జగన్ నాకు టికెట్ ఇచ్చారు. గంటా తన సెంటిమెంట్ ప్రకారం ఇక్కడ పోటీ చేయకూడదు. కానీ ఆయన ఏరికోరి ఇక్కడే పోటీకి వచ్చారు. అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. ఇద్దరం మిత్రులమే. అయినా పోటీ తప్పలేదు.

నేడే కూటమి సభ

... 3వ పేజీ తరువాయి

రోడ్డును పూర్తిగా వాహనాల రాకపోకలకు వినియోగించేలా ఏర్పాట్లు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను విశాఖ డీఐజీ విశాల్‌గున్నీ, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. మోదీ, చంద్రబాబుల కోసం మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి 3.40 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.50కు విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4కు కశింకోట మండలం ఉగ్గినపాలెంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సాయంత్రం చేరుకుంటారు. 4.40కు ఉగ్గినపాలెం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి తాళ్లపాలెం సభా వేదిక వద్దకు ఐదు గంటలకు చేరుకుంటారు. సభ అనంతరం 6.40కు రోడ్డు మార్గంలో విశాఖ చేరుకొంటారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు.

యువత భవిష్యత్తును నాశనం చేసిన వైసీపీ

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు


గాజువాకలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 5: రాష్ట్రంలో యువత భవిష్యత్తును వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు లేనిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని వైసీపీ విస్మరించిందని విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి కేవలం వలంటీర్ల జాబ్‌లు మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని యువత ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం జరిగిందని, రానున్న కాలంలో అలా జరగకుండా చేయడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు అందరూ కృషి చేయాలన్నారు. విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని పల్లా కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ యువత అంటే బానిసలుగా వైసీపీ ప్రభుత్వం చూసిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, దల్లి గోవింద్, కరణం కనకారావు, తదితరులు పాల్గొన్నారు. కాగా స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి అడుసుమల్లి దీప్తి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు.

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

కూర్మన్నపాలెం/అగనంపూడి: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేటలో పార్టీ సీనియర్ నాయకుడు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో, 87వ వార్డు అంబేద్కర్ కాలనీ, శ్రీగణేశ్ నగర్‌లలో కార్పొరేటర్ బొండా జగన్, 88వ వార్డు పరిధి దువ్వాడలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు కూటమి మేనిఫెస్టో ప్రజలందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అదేవిధంగా అగనంపూడి నడక మైదానం వద్ద ఉదయం పలువురు వాకర్స్‌ను పల్లా శ్రీనివాసరావు కలిసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉక్కు పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. నాయకులు కర్రి దశేంద్ర, గంధం వెంకటరావు, సోమశేఖర్, ఎం.నరసింగరావు, కె.సత్యారావు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


87వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న 'పల్లా'


సీఎం రమేశ్, పంచకర్ల రమేశ్‌బాబులకు పూలమాలలు వేసి హారతిస్తున్న మహిళలు

కూటమి మేనిఫెస్టోతో జగన్‌కు వణుకు

బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

పెందుర్తి, మే 5: కూటమి మేనిఫెస్టో చూసి సీఎం జగన్‌కు వణుకు పుట్టిందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. పెందుర్తిలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆయనతో పాటు జనసేన నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా వారు అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేయగా, అయ్యప్ప సేవా ట్రస్టు సభ్యులు గజమాలతో వారిని సత్కరించారు. అనంతరం జేఎన్ఎన్ఆర్‌యూఎం కాలనీ మీదుగా నల్లక్వారీ, అయ్యప్పనగర్, దుర్గాఆదర్శనగర్, కుమ్మర కాలనీ, మహాలక్ష్మీనగర్ (బీసీ కాలనీ), అంబేద్కర్‌నగర్, ద్రోణంరాజునగర్, ప్రకాశ్‌నగర్, దొగ్గవానిపాలెం, రైల్వే స్టేషన్, ప్రశాంతినగర్, సూర్యనగర్, పాత పెందుర్తి. యాతపేట, చాకలిపేట, బ్రహ్మంగారి గుడి, సాయినగర్‌లలో ప్రచారం చేశారు. అడుగడుగునా ప్రజలు వారికి పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ వైసీపీ గూండాలతో ప్రజలను బెదిరించి ఇన్నాళ్లు అరాచక పాలన సాగించిన జగన్‌కు ఇవే ఆఖరి ఎన్నికలన్నారు. కూటమి మ్యానిఫెస్టో చూసిన వైసీపీ నేతలు మోదీ, చంద్రబాబు, పవన్ త్రిమూర్తుల ద్వయంతో కూటమికి ప్రజలు పట్టం కడితే అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతామన్నారు. అనకాపల్లి జిల్లా ఎంపీగా తనను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ వైసీపీకి ఇక కాలం చెల్లిందన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు పనులు తక్కువ, మాటలు ఎక్కువ అని విమర్శించారు. ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమిని ప్రజలంతా ఆదరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీగా సీఎం రమేశ్‌ను, ఎమ్మెల్యేగా పంచకర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, జనసేన వార్డు అధ్యక్షుడు డీబీఎల్ నాయుడు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, నాయకులు రెడ్డి నారాయణరావు, పెంటకోట రాజేంద్రప్రసాద్, కిల్లి రమేశ్, ఆళ్ల రమేశ్, పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రమేశ్, పంచకర్ల


ఆత్మీయ సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న కాపు, తెలగ, బలిజ సంఘాల ప్రతినిధులు, హాజరైన ప్రజలు

వైసీపీ పాలనలో కాపుల అభ్యున్నతికి కృషి

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, మే 5: కాపుల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం కృషి చేయడంతో పాటు అన్ని రంగాలలో వారికి పెద్దపీట వేసిందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో మాజీ కార్పొరేటర్, వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో కాపు, తెలగ, బలిజ సంఘాలతో ఆనంద్‌కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులకు సీట్ల కేటాయింపుతో పాటు మంత్రివర్గంలో కూడా సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కాపు నేస్తం వంటి పథకాలతో కాపుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో కోట్లాది రూపాలయతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పించన్ల పంపిణీ, విద్య, వైద్య సేవలు అందిస్తున్నామని ఆయనన్నారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల పదమూడున జరగనున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీరాణిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాపు, తెలగ, బలిజ సంఘ ప్రతినిధులు ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ పశ్చిమ పరిశీలకులు పేడాడ రమణికుమారి, పీలా ఉమారాణి, నాయకుడు గేదెల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పలు చర్చిలలో పీలా రమాకుమారి ప్రార్థనలు

మల్కాపురం/వేపగుంట: ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని, నిరుపేదల సంక్షేమం కోసం నిత్యం పాటు పడుతున్న జగన్‌ను మళ్లీ సీఎంను చేస బాధ్యత మనందరిపై ఉందని ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి అన్నారు. ఆదివారం ఆమె 52, 58, 61 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తన సోదరుడైన ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీరాణిని గెలిపించాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంతో ఎంతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అదేవిధగా వైసీపీ ప్రభుత్వం మళ్లీ రావాలంటూ చర్చిలలో ఆమె ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమంల్లో కార్పొరేటర్ కొణతాల సుధ, వైసీపీ నాయకులు దాట్ల శ్రీనివాసరాజు (పొడుగు రాజు), గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు (వాసు), ఆల్ఫా కృష్ణ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీహరిపురం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న పీలా రమాకుమారి

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆనంద్‌కుమార్

చర్చిలలో 'ఆడారి' సోదరి రమాకుమారి ప్రార్థనలు


సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరం

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

సిరిపురం, మే 5: ఎన్నికల సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై పూర్తిగా అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు.

ఆదివారం ఆయన ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పశ్చిమ నియోజకవర్గం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీవీ ప్యాట్లు ప్రింటయ్యే తీరు, ఇతర ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అభ్యర్థుల పేర్లు, గుర్తులు అప్‌లోడింగ్ విధానం గురించి అడిగి తెలుసుకున్న ఆయన ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి అంశంపైనా సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని, ఏవైనా సందేహాలుంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మొత్తం 288 ఈవీఎంలకు కమిషనింగ్ జరిగినట్టు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 22, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 24, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబాటి 32, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 30, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్(పెన్సిల్) 80, పొటల్స్ 46, కీరదోస 30, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 38, కంద 60, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

పంపిణీ చేసింది కాదు జగన్.. దోచింది చెప్పాలి

కాపు నేత, కూటమి నాయకుడు వంగవీటి రాధాకృష్ణ



అగనంపూడిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ

మల్కాపురం, మే 5: : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం పేరుతో లక్షల కోట్ల రూపాయలు పంపిణీ చేశామని చెబుతున్నారని, అదే క్రమంలో ఎంత దోచింది కూడా చెప్పాలని కాపునేత, కూటమి నాయకుడు వంగవీటి రాధాకృష్ణ పేర్కొన్నారు. శ్రీహరిపురం కోరమాండల్ గేటు సమీపంలో గల ఏపీఐఐసీ స్థలంలో ఆదివారం రాత్రి 40, 58 నుంచి 63 వార్డుల కాపు కులస్థులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మనందరం చేయి చేయి కలిపి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అరాచర పాలన సాగించిందని, అమరావతిని నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ హయాంలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటే ఎంతో అనుభవజ్ఞుడైన చంద్రబాబుమళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉంద న్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా గణబాబును, విశాఖ ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం గణబాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలన మోసపూరితంగా సాగిం దని విమర్శించారు. కార్యక్రమానికి నాయకుడు పొట్టి మూర్తి అధ్యక్షత వహించగా, కార్పొరేటర్ గల్లా చిన్న, విశ్వనాథుల దినకర్, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి కాలం చెల్లింది..

అగనంపూడి: ఐదేళ్లు పాటు రాష్ట్రాన్ని దోచుకుతిన్న వైసీపీకి కాలం చెల్లిందని కాపునేత, కూటమి నాయకుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. 79వ వార్డు పరిధి వేపచెట్టు జంక్షన్ వందడుగుల రోడ్డులో రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటిపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఏపీ అన్ని రంగాలలో మళ్లీ అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, కూటమి నాయకులు కోన తాతారావు, రౌతు శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర, ఎం.విజయ్, సోమశేఖర్, వసంతరావు, జి.రామారావు, గంధం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడతారు

విశాఖ ఎంపీ అభ్యర్థి సతీమణి తేజస్విని


అగనంపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తేజస్విని

గాజువాక, మే 5: ఎంతోమంది త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీభరత్ ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని, ఆయనను ఎంపీగా గెలిపిస్తే ఉక్కు కర్మాగారం కోసం పోరాడతారని శ్రీభరత్ సతీమణి తేజస్విని అన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు సమర్థవంతమైన నాయకత్వం చాలా అవసరమని, శ్రీభరత్ అయితే ఉక్కు కర్మాగారాన్ని కాపాడుతారన్నారు. అగనంపూడిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఎంపీలు దివంగత ఎంవీవీఎస్.మూర్తి, ఎర్రన్నాయుడు స్టీల్‌ప్లాంటును కాపాడారని, ఇప్పుడు అదే బాధ్యతను శ్రీభరత్ తీసుకుంటారన్నారు. రాష్ట్రం బాగుండడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం తాను ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడ్డానన్నారు. కార్యక్రమంలో జనసేన గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

బతుకుల బాగు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఎన్.ఎ.డి.జంక్షన్: ప్రజల బతుకులు బాగుపడాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సతీమణి తేజస్విని కోరారు. 90వ వార్డు పరిధి ఏపీఎస్ఈబీ కాలనీలో ఆదివారం వివిధ వర్గాల మహిళలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే యువత ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లనవసరం ఉండదన్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా గణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఎమ్మెల్యే గణబాబు సతీమణి మధుమతి, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో శ్రీభరత్ పిన్ని ప్రచారం

కూర్మన్నపాలెం: వడ్లపూడిలో టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా ఆయన పిన్ని శ్రీవాణి, 'గాజువాక' అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును గెలిపించాలంటూ ఆయన సతీమణి పి.లావణ్య ప్రచార ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాబు రావాలి-బతుకులు మారాలంటూ ఫార్మా ఉద్యోగుల ప్రచారం


మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫార్మా ఉద్యోగులు

కూర్మన్నపాలెం, మే 5: బాబు రావాలి-బతుకులు మారాలి అంటూ ఫార్మా ఉద్యోగులు 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ మార్కెట్‌లో ఆదివారం విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు చిత్రాలతో కూడిన పసుపు రంగు టీ షర్టులు ధరించి వారు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఫార్మా ఉద్యోగ సంఘ ప్రతినిధి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఏ ఒక్కరిని కదిలించినా ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి వైసీపీని ఇంటికి పంపుతామని చెబుతుండడం శుభ పరిణామమన్నారు. అందరూ సైకిల్ గుర్తుపై ఓటు ఎంపీగా శ్రీభరత్, ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావులను గెలిపించాలని కోరుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎస్.రామారావు, వినోద్, శేషు చౌదరి, రాంబాబు, సతీశ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో అందరికీ మేలు

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మహిళలకు చేయూతనివ్వడంతో పాటు అన్ని వర్గాలకు అండగా ఉండేలా కూటమి మేనిఫెస్టో ఉందని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లారు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు వుడా ఫేజ్-5లో శ్రీభరత్, పల్లాకు మద్దతుగా ప్రచార ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ 'నెల్లిమర్ల' పరిశీలకునిగా జయరాజు

పెదగంట్యాడ, మే 5: తెలుగుదేశం పార్టీ విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకునిగా పాండ్రంకి జయరాజు నియమితులయ్యారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయానికి జయరాజు కృషి చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తనను టీడీపీ 'నెల్లిమర్ల' పరిశీలకునిగా నియమించిన అచ్చెన్నాయుడుకు, నాయకుడు హర్షవర్ధన్ ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మైనారిటీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు


ఆత్మీయ సమావేశంలో గణబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముస్లింలు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 5: మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 90వ వార్డు పరిధి కాకానీనగర్‌లో ముస్లింలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు రంజాన్ తోఫా, ఇతర సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ మైనారిటీలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేశారన్నారు. అందువల్ల ముస్లింలందరూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. విమాన్‌నగర్, కాకానీనగర్, పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు ముస్లింల కుటుంబాలు గణబాబుకు మద్దతు పలికారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి ప్రసాద్, సురేశ్, కృష్ణ, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ వార్డు అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. గోపాలపట్నంలోని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గణబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన తనయుడు మౌర్య సింహ వారికి పార్టీ కుండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మౌర్య సింహ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.


టీడీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న గణబాబు తనయుడు మౌర్య సింహ

'ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, మే 5: ప్రపంచంలోనే భారత్‌ను ఓ ఆదర్శ దేశంగా నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. అనకాపల్లిలో సోమవారం జరగనున్న ప్రధాని సభను విజయవంతం చేయాలంటూ ఆదివారం పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్న లక్ష్యంతోనే మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రానివిగా సీఎం జగన్ తప్పుడు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, శశిధరన్, బాటా శ్రీను, జి.శంకరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసిత సంఘం నేత యెల్లేటి రామారావుకు నివాళి

పెదగంట్యాడ, మే 5: ఉక్కు నిర్వాసితుల హక్కుల సాధనకు సీపీఐ నాయకునిగా, ఉక్కు నిర్వాసిత సంఘం నాయకునిగా యెల్లేటి రామారావు చేసిన కృషి మరువరానిదనిసీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ అన్నారు. రామారావు 19వ వర్ధంతి సందర్భంగా పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీని, నిర్వాసిత సంఘాన్ని ముందుకు నడిపిన ఘనత యెల్లేటికే దక్కుతుందన్నారు. సీపీఐ పెదగంట్యాడ శాఖ కార్యదర్శి వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ, విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ

ఉక్కుటౌన్‌షిప్, మే 5: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో ఆదివారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు, పెద్దలు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెద్దల పట్ల గౌరవం, వారి ఆలోచనలను నేటి తరం వారు ఆచరించాలన్నారు. పెద్దల అనుభవాలు చాలా గొప్పవని, వీటిని అలవరుచుకోవాలన్నారు. సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వంశీకృష్ణకు కొబ్బరితోట వద్ద స్వాగతంపలుకుతున్న మహిళలు



31వ వార్డులో వంశీకృష్ణ సతీమణి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

'సౌత్'ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

» జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

అల్లిపురం, మే 5: రాష్ట్రంలోనే దక్షిణ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చుదిద్దుతానని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రస్తుత నాయకులు పాతనగరాన్ని అభివృద్ధి చేశామని చెబుతున్నా.. అవన్నీ శిలాఫలాకలపైనే నిలిచిపోయాయన్నారు. తనను గెలిపిస్తే ఓల్డ్‌సిటీని గ్రీన్‌సిటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం జీవీఎంసీ 34వార్డు పరిధి లీలామహల్‌రోడ్డు, సాయిబాబావీధి, కెప్టెన్ రామారావు జంక్షన్, కొబ్బరితోట, గీత్ సంగీత్ రోడ్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా శ్రీభరత్ గెలిపించాలన్నారు. ఈ సందర్భంలో వార్డులో పెద్ద ఎత్తున మహిళలు, యువత, వంశీ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రాంకుమార్, పి. రాజేశ్వరి, జనసేన అధ్యక్షుడు నీలంరాజు,వాసుపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 33వార్డు వెంకటేశ్వరమెట్ట, అమ్మవారివీధి, కుమ్మరివీధి ప్రాంతాల్లో ఆదివారం వార్డు కార్పొరేటర్, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులు భీశెట్టి గోపికృష్ణ ఆధ్వర్యంలో బ్యాలట్ నమూనాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

మద్దిలపాలెం: కూటమి పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్ర భవిష్యత్తు మార్చుతుందని దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. శివాజీపాలెంలో ఆదివారం ఆయన కార్యాలయంలో మత్స్యకార, యాదవ నాయకులు జనసేన పార్టీలో చేరారు. మత్స్యకార నాయకుడు గరికన వెంకట్, యాదవ నాయకులు ఒమ్మి కిరణ్, సర్దార్‌సింగ్ చిన్నా తదితరులు జనసేనలో చేరిలోఉన్నారు.టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, వాసుపల్లి రాజు పాల్గొన్నారు.

29 వ వార్డులో ప్రచారం..

మహారాణిపేట: వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం మహారాణిపేటలోని 29 వార్డు వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు, తనను, ఎంపీ అభ్యర్థి ఎం శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి..

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించాలని ఆయన సతీమణి పద్మజా కోరారు. ఆదివారం వార్డులోని డాబాగార్డెన్స్, యల్లమ్మతోట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.అపార్ట్‌మెంట్ వాసులంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రూప, గోపి, కనకవల్లి, జనసేన, టీడీపీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ, పక్కన విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్



బైక్ ర్యాలీలో కూటమి శ్రేణులు

కూటమి విజయం తథ్యం ; వంగవీటి రాధాకృష్ణ

» నార్త్ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజుకు మద్దతుగా బైక్ ర్యాలీ

మురళీనగర్, మే 5 ; ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు భద్రతతో కూడిన పాలన అందించాలంటే కూటమి ప్రభుత్వ విజయంతోనే సాధ్యపడుతుందని వంగవీటి రాధాకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు మంచి పాలనను అందించడంలో అనుభవమున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తిరిగి ఈ రాష్ట్రంలో ముఖ్యమం త్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విష్ణుకుమార్‌రాజు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా నిర్వహించి మద్దతు ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాధవధార సీతన్నగార్డెన్స్ నుంచి ప్రారంభమైన మురళీనగర్, ఎన్‌జిజిఓస్ కాలనీ, బర్మాక్యాంపు ప్రాంతాల మీదుగా సాగింది. అశేష జనం మద్దతుగా ఆరంభమైన బైకు ర్యాలీలో యువకులు ఉత్సాహంగా పార్టీల జెండాలు పట్టుకుని నాయకులకు సంఘీబావం తెలిపారు. ర్యాలీలో ఎంపి అభ్యర్థి భరత్ ఉత్సాహంగా ప్రజలకు అభివాదం చేస్తు కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెన్మెత్స.విష్ణుకుమార్ రాజును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న విష్ణుకుమార్‌రాజు సతీమణి సీతాసుజాత

ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని విష్ణుకుమార్‌రాజు అన్నారు. గత ఐదేళ్ల పాలనలో రా ష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కి పోయిందన్నారు. అవినీతి రహిత పాలనకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. భూ కబ్జాలు, హత్యలు, ప్రతి ఒక్కరిపై మాదక ద్రవ్యాల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, టీడీపీ 50 వ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, 50, 49వవార్డుల కూటమి నాయకులు, పార్టీఅభిమానులు, మహిళలు ఉన్నారు.

విష్ణుకుమార్‌రాజు సతీమణి ప్రచారం

విష్ణుకుమార్ రాజు సతీమణి సీతాసుజాత సీతమ్మధార పరిసరాల్లో ప్రచారం చేశారు. పలు అపార్టులమెంట్‌ల వద్దకు వెళ్లి కరప త్రాలు అందజేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గాన్ని స్మార్ట్ సిటీగా మారుస్తా

జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ పేరుతో నగరంలో కొన్ని ప్రాంతాలనే అభివృద్ధి చేస్తున్నారని, వాటితో సమానంగా ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ చెప్పారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నియోజకవర్గ మేనిఫెస్టోని వంద రూపాయల స్టాంప్ పేపరుపై విడుదల చేశారు. మొత్తం 34 అంశాలతో మేనిఫెస్టో ఇచ్చామని, గెలిచిన తరువాత ప్రతి మూడు నెలలకోసారి ఏమి సాధించామో ప్రజలకు చెబుతామన్నారు. మూత పడిన విశాఖ పోర్టు ఆస్పత్రిని తెరిపిస్తామన్నారు. మోడల్ స్కూళ్లు, జై భారత్ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, పిల్లలకు సాంస్కృతిక కేంద్రం పెడతామన్నారు. కేజీహెచ్‌కు వెళ్లే రోగులకు వార్డులోనే టోకెన్లు ఇచ్చే విధానం అమలుచేస్తామన్నారు. యువతకు ఉపాధి, కెరియర్ గైడెన్స్ కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు.

లక్ష ఉద్యోగాలు ఎన్ఆర్ఐ టీడీపీ లక్ష్యం

- ఎన్ఆర్ఐ టీడీపీ హెడ్ రవికుమార్ వేమూరి



విజయచిహ్నం చూపిస్తున్న ఎన్ఆర్ఐలు

మధురవాడ, మే 5 : రాష్ట్రంలోని యువతకు ఏటా లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్ఆర్ఐ టీడీపీ హెడ్ డాక్టర్ రవికుమార్ వేమూరి తెలిపారు. మధురవాడ వి. కన్వెన్షన్‌లో ఆదివారం ఎన్ఆర్ఐ టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూచన మేరకు ఏపీ విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ఏటా లక్ష మందికి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్రపంచంలో 121 దేశాల్లో ఎన్ఆర్ఐ టీడీపీ శాఖలు ఉన్నాయని, .27 వేల మంది సభ్యులు ఉన్నారని, 4 వేల మంది పారిశ్రామికవేత్తల అండ తెలుగు విద్యార్థులకు ఉంటుందన్నారు.



ప్రచారంలో కేకే రాజు



కేకే రాజును గజమాలతో సన్మానిస్తున్న వెలమ సంఘ ప్రతినిధులు

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం

» ఉత్తర నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు

సీతమ్మధార, మే 5: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందినట్టు ఉత్తర నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు అన్నారు. శంకరమఠం రోడ్డు ఎదురుగా ఉన్న పద్మశాలి భవన్‌లో పద్మశాలి సంఘం కన్వీనర్ గుద్దే వేణు బ్రదర్స్, భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం, ఉత్తర నియోజకవర్గ పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజుతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతినిధులు గేదే వేణు, తెడ్లపు వెంకటేశ్వరరావు, చిక్కా సత్యనారాయణ, కులపాక సన్యాసిరావు, కర్లం వెంకటేశ్వరరావు పాల్గొని కేకే రాజును సన్మానించారు.సంపంగి శ్రీనివాసరావు, సంఘం పెద్దలుపాల్గొన్నారు.

కేకే రాజుకు మద్దతుగా గ్రామ సంఘాల సమావేశం

అక్కయ్యపాలెం: కేకే రాజుకు మద్దతుగా తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ నాలుగు గ్రామ సంఘాల పెద్దలు ఆదివారం ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేకే రాజు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాము ఆయనకు మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. 42వ వార్డు కా ర్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, నాయకులు పీఎల్ఎన్ పట్నాయక్, దాడి శ్రీను, పరదేశమ్మ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. గవర తాటిచెట్లపాలెం సాక్షి గణపతి ఆలయం వద్ద, ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ కేవీఎన్ శశికళ ఆధ్వర్యంలో కేకే రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మార్కెట్ వర్తక సంఘం సభ్యులతో కె.కె.రాజు సమావేశం

కంచరపాలెం: కంచరపాలెం మార్కెట్ వర్తకం సంఘం సభ్యులతో కేకే రాజు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉదయం వాకర్స్‌తో సమావేశమైన కె.కె.రాజు అభివృద్ధికి ఓటేయాలని కోరారు.

మాధవధార; కేకే రాజు మురళీనగర్‌లో ఆదివారం రాత్రి వైసీపీ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల.వెంకటరావుఆధ్వర్యంలో జరిగిన వెలమల ఆత్మీయ సమావేశం ఆయన పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగన్నాథం, వికెపిసిపిఐఆర్ మాజీ ఛైర్మన్ చొక్కాకుల లక్ష్మి, సీనియరు నాయకులు జీవి.రవిరాజు బాపు నాయుడు హాజరయ్యారు. రాజీవ్‌నగర్‌లో దైవ స్వరూపి చర్చి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కేకే రాజు పాల్గొన్నారు. పాదర్ ప్రభుదాసు, 51వవార్డు కార్పొరేటరు రెయ్యివెంకటరమణ, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా.గురువులు, వీఎంఆర్డీఏ ఛైర్మన్ సనపల.చంద్రమౌళి, కార్పొరేటర్లు ఉన్నారు.

జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

» రాష్ట్రంలో కూటమికి 160 సీట్లు ఖాయం

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి చరిత్ర సృష్టించబోతున్నదని, 175 స్థానాలకు 160 గెలవనుందని..జూన్ 9న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమికి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని, రాయలసీమలో వైసీపీ కంచుకోటలు సైతం బద్ధలు కానున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉండగా కూటమి 30కి పైగా గెలుచుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కూటమి 'ప్రజాగళం' పేరుతో ప్రకటించిన మేనిఫెస్టోకు అన్నివర్గాల నుంచి విశేషమైన స్పందన కనిపిస్తున్నదన్నారు. కూటమి ప్రకటించిన పథకాల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారంటూ జగన్ ప్రశ్నించడాన్ని గంటా తప్పుబట్టారు. మాడుగుల మండలం తారువాలో దాడికి గురైన బీజేపీ కార్యకర్తను పరామర్శించడానికి అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అక్కడికి వెళితే డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న బూడి ముత్యాలనాయుడు తన అనుచరులతో దాడి చేయించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ భీమిలి ఇన్‌చార్జి రామునాయుడు, జనసేన నాయకుడు ఎస్.శ్రీనివాస్, టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

» సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైసీపీ ఐదేళ్ల పాలన మొత్తం అవినీతిమయంగా మారిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు విశాఖ విచ్చేసిన ఆమె ఆది వారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో వైసీపీ ప్ర భుత్వం రాష్ట్ర హక్కుల సాధనలో పూర్తిగా విఫలమైందన్నారు. విభజన చట్టంలోని హామీలను పోరాడి సాధించుకోవాలన్న స్పృహ కూడా లేకుండా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు.

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమే...

... 3వ పేజీ తరువాయి

ఇంత వరకూ పైసలు విడుదల చేయలేదు.

పథకం పనితీరు ఇలా

గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం కుడి కాలువకు తరలిస్తుండగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ కాలువకు సరఫరా చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి సమీపంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేసి, అక్కడి నుంచి ఏలేరు జలాశయంలోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి గతంలోనే ఉన్న కాలువ ద్వారా గోదావరి జలాలను విశాఖ ఉక్కు కర్మాగారానికి, విశాఖ ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. కాగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందు కోసం కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేసి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపూడి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. దీని నుంచి కాలువల ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని వివిధ మండలాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా పథకానికి రూపకల్పన చేశారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ 162.409 కిలోమీటరు వద్ద..అంటే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి 3.4 కి.మీ. పొడవున గ్రావిటీ కెనాల్‌ను అదే మండలంలోని జమాదులపాలెం వరకూ నిర్మించనున్నారు. అక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి ఆరు పంపుల సహాయంతో 31.2 ఎంసీఎఫ్‌టీల నీటిని 53 మీటర్ల ఎత్తుకు ఎత్తి పోస్తారు. అదేవిధంగా తీడ వద్ద ఏర్పాటుచేయనున్న మరో ఎత్తిపోతల పథకం ద్వారా మూడు పంపుల సహాయంతో 50.6 ఎంసీఎఫ్‌టీల నీటిని 52 మీటర్ల ఎత్తుకు తీసుకువెళతారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పంప్ చేసిన నీటిని 14.5 కి.మీ. పొడవున నిర్మించనున్న లీడింగ్ చానల్ ద్వారా బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల సరిహద్దుల్లో నిర్మించ తలపెట్టిన పెదపూడి జలాశయానికి తరలిస్తారు. అక్కడ నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా విశాఖ గ్రామీణ జిల్లాలోని వివిధ మండలాల్లో గల పంట పొలాలకు సరఫరా చేస్తారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. అయితే పనులు ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం...సుజల స్రవంతి ప్రాజెక్టులో కదలిక తీసుకువచ్చింది. తొలిదశలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. 2017 సెప్టెంబరులో రూ.2,022 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. 2018 నవంబరు 15న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిదశ పనులకు చోడవరంలో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. అయితే కాలువ తవ్వకానికి అవసరమైన భూ సేకరణ జరిగేలోపు ఎన్నికలు వచ్చాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అప్పటికి 25 శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టుల కాంట్రాక్టులను రద్దు చేయడంతో సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా ఆ జాబితాలో చేరింది. కొంతకాలం తరువాత పాత కాంట్రాక్టర్‌కే నిర్మాణ పనులు అప్పగించారు. కానీ అధికారులు భూసేకరణ చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. గడచిన నాలుగేళ్ల నుంచి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబునాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ తప్ప వైసీపీ ప్రభుత్వ ఎటువంటి చెల్లింపులూ జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.17,050.2 కోట్లకు అంచనా సవరణ

రెండేళ్ల క్రితం ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు అంచనాను తాజా రేట్ల మేరకు రూ.17,050.2 కోట్లకు సవరించి ఆమోదించారు. తొలి దశ పనులు రూ.2,022 కోట్లుగానే కొనసాగించడం గమనార్హం. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండు ప్యాకేజీలకు రూ.3,800 కోట్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. భూసేకరణకుగాను అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలు ఏర్పాటుచేశారు. రెండు దశల పనులు చేపట్టాలంటే భూమి అవసరం. మొత్తం ప్రాజెక్టుకు 16,040 ఎకరాలు అవసరం. దీంట్లో విశాఖ జిల్లాలో 393 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాలకుగాను ఇప్పటివరకు 1,157.76 ఎకరాలకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు తప్ప రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించాలంటే తొలుత భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అంటే రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతులకు పరిహారం, పనులు చేపట్టేందుకు కనీసం రూ.నాలుగు వేల కోట్లు విడుదల చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు కోరినా ప్రభుత్వం ఇంతవరకు పైసా విడుదల చేయలేదు.

మొత్తం ఆయకట్టు ప్రాంతం ఎనిమిది లక్షల ఎకరాలు

ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 3.2 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి దశలో అనకాపల్లి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 1.3 లక్షల ఎకరాలకు, రెండో దశలో అనకాపల్లి జిల్లాలో ఆరు మండలాలు, విశాఖ జిల్లాలోని ఒక మండలం పరిధిలో మొత్తం 1.35 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 11 మండలాల్లో 1.33 లక్షల ఎకరాలకు నీరు అందిస్తారు. తరువాత ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఆరు మండలాల్లో 0.85 లక్షల ఎకరాలతోపాటు మిగిలిన రెండు జిల్లాలో మిగిలిన ఆయకట్టును నీరు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఇంకా మూడు జిల్లాల్లో 1200 గ్రామాల్లో ఉండే 30 లక్షల జనాభాకు, పరిశ్రమల అవసరాలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకు గోదావరి నుంచి నుంచి 63 టీఎంసీల వరద నీటిని తరలించాల్సి ఉంటుంది. దీంట్లో సాగునీటి కోసం 54 టీఎంసీలు, తాగునీటి కోసం 4.46 టీఎంసీలు,పరిశ్రమలకు 5.84 టీఎంసీలు అవసరమని ప్రతిపాదనల్లో పొం దుపరిచారు. ఇందుకోసం అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పెదపూడి వద్ద 3.15 టీఎంసీలు,కె.కోటపాడు మండలం భూదేవి వద్ద 6.55 టీఎంసీలు, విజ యనగరం జిల్లా ఎస్.కోట మండలం వీరనారాయణపురం వద్ద 6.2 టీఎంసీలు, అదే మండలంతాటిపూడి వద్ద 3.8 టీఎంసీల నీరు నిల్వ కోసం జలాశయాలు నిర్మించాల్సి ఉంది.

శాకాహారులను ఎన్నుకుందాం..

డాబాగార్డెన్స్, మే 5 : ఎన్నికల్లో శాకాహారం తీసుకునే అభ్యర్థులను ఎన్నుకోవాలని పిరమిడ పార్టీ ఆఫ్ ఇండియా విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యవాణి పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పిరమిడ్ పార్టీ ఎన్నికల్లో నిర్వహించనున్న కార్యకలాపాలపై పోస్టర్ విడుదల చేశారు.

ఓటు కోసం క్యూ

... 3వ పేజీ తరువాయి

పది గంటలకు పోలింగ్ ప్రారంభం కావల్సి ఉన్నా కొన్నిచోట్ల ఆలస్యమైంది. విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటుచేసిన సెంటర్‌లో ఉదయం 11 గంటల తరువాత పోలింగ్ ప్రారంభం కావడంతో అప్పటికే గం టకుపైగా క్యూలో ఉన్న ఉద్యోగులు అసహనం వ్యక్తంచేశారు. ఆర్టీసీ ఉ ద్యోగులకు ఈనెల 7,8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చినా పలువురు ఉద్యోగులకు ఇచ్చిన ఆర్డర్‌లో ఆదివారం నుంచి ఓటేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో భీమిలి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది డ్రైవర్లు, కండక్టర్లు ఓ టేయడానికి రాగా, అక్కడ సిబ్బంది తొలుత అంగీకరించలేదు. దీంతో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వ నాథన్ జోక్యం చేసుకుని వారందరికీ ఓటేయడానికి అవకాశమిచ్చారు. కొందరి ఉద్యోగుల పేర్లు జాబితాలో కనిపించలేదు. దీనిపై వారందరు ఫిర్యాదు చేయడంలో అప్పటికప్పుడు ఫారం 12 ఇచ్చారు. అయితే అటువంటి వారందరికీ మరోరోజు ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. జిల్లా విద్యాశాఖలో సుమారు 30 మంది ఉద్యోగుల పేర్లు లేకపోవడంతో వారందరికీ తాజాగా ఫారం 12 జా రీచేశారు. కలెక్టర్‌మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కెఎస్. విశ్వనాథన్, అన్ని సెగ్మెంట్ల ఆర్వోలు పోలింగ్ తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సందే హాలు నివృత్తి చేశారు. కాగా పోలింగ్ ప్రశాంతంగానిర్వహించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

అభ్యర్థుల సందర్శన

అభ్యర్థులు పలువురు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. విశాఖ లోక్‌సభకు టీడీపీ నుంచి పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి జై భారత్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న వీవీ లక్ష్మీనారాయణ, విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తోపాటు కొందరు స్వతం త్రులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఇంకా అభ్యర్థుల తరఫున ఏజెంట్లు వచ్చి పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారు. ఇదిలావుండగా ఏయూ ఇన్‌గేటు నుంచి అవుట్‌గేటు మధ్యన ప్రధాన రహదారిపై పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హడావిడి చేశారు. ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే దారికి ఇరువైపులా చెట్ల కింద ఓటర్ల జాబితాలు పట్టుకుని ప్రలోభాలకు గురిచేసేందుకు యత్నించారు. శనివారం రాత్రి పలువురు ఉద్యోగులకు వైసీపీ నాయకులు స్వయంగా లేదా వారికి అను కూలంగా సంఘాల ద్వారా తాయిలాలు అందజేశారనే ప్రచారం సాగుతుంది. జిల్లాలో ఓటు హక్కు ఉండి ఇక్కడే పనిచేస్తున్న 11,221 మందికిగాను 3152 మంది తొలిరోజు ఆదివారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న 5389 మందిలో 1136 మంది ఓటేశారు.

రూ.550 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

... 3వ పేజీ తరువాయి

చేసినవి, మళ్లీ గెలిస్తే చేయాలనుకుంటున్నవి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు.

ప్రశ్న: పర్యాటక శాఖా మంత్రిగా ఏమి చేశారు?

జవాబు: అప్పటివరకు పర్యాటక శాఖకు సరైన పాలసీ లేదు. ఇన్వెసర్ ఫ్రెండ్లీ పాలసీని తీసుకువచ్చాము. దానివల్ల భీమిలి పరిసరాల్లో స్టార్ హోటళ్లు, రిసార్ట్స్ నిర్మాణానికి భారీ పెట్టుబడులు వచ్చాయి. అన్నవరంలో రూ.350 కోట్లతో 7 స్టార్ హోటల్ నిర్మాణం మొదలైంది. అలాగే ఓబెరాయ్ గ్రూపు విల్లాల నిర్మాణానికి ముందుకు వచ్చింది. విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు కళాకారులకు కూడా రాష్ట్ర పురస్కారాలను అందించాం. స్పోర్ట్స్‌కి కూడా పాలసీ తీసుకువచ్చాం.

ప్ర: భీమిలి అభివృద్ధికి ఏమి చేశారు?

జ: ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు అందించాం. ఇలా నియోజకవర్గం అంతా కలిపి రూ.2,500 కోట్లు పథకాల రూపంలో పంపిణీ చేశాము. మరో రూ.550 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాము. మూడు దశాబ్దాలుగా నలుగుతున్న జూట్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం చూపించి కార్మికులకు రూ.36 కోట్లు ఇప్పించాం. దివీస్ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.3 కోట్లతో టి.నగరంపాలెంలో గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాం. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నా నిధులు లేవు. దీనికి కూడా సీఎస్ఆర్ నుంచి రూ.2 కోట్లతో శంకుస్థాపన చేశాం. పాండ్రంకిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరుచేయించాం. అనంత పద్మనాభస్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణం రూ.5 కోట్లతో చేపట్టాం. చివరి దశలో ఉంది. భీమిలి తాగునీటి సమస్య నివారణకు రూ.10 కోట్లతో పైపులైన్ వేయించాం. సాగర్‌నగర్, మంగమారిపేట, ఎస్ఓఎస్‌ల వద్ద బీచ్‌లు అభివృద్ధి చేశాం. ఒక్క భీమిలి నియోజకవర్గంలో పది అర్బన్ పీహెచ్‌సీలు పెట్టించాం. పద్మనాభంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుచేశాం. ఈ జూన్‌లోనే అడ్మిషన్లు జరుగుతాయి.

ప్ర: మళ్లీ గెలిస్తే ఏమి చేయాలనుకుంటున్నారు?

జ: భీమిలి గ్రామీణ నియోజకవర్గం. యువతకు ఉపాధి కోసం ఆనందపురం మండలంలో ఏపీఐఐసీ ద్వారా 150 ఎకరాలు సేకరించాం. అందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేసి స్థానికులకు ఉపాధి కల్పిస్తాం. విశాఖ నుంచి భోగాపురం వరకు భీమిలి మీదుగా ఆరు వరుసల రహదారి వేయిస్తాం. దీనివల్ల హైవేలో మధురవాడ వద్ద ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది. మధురవాడ, పీఎంపాలెం, భీమిలి ప్రాంతాల్లో రూ.500 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తాం. సీఎస్ఆర్ నిధులతో చంద్రపాలెం వద్ద జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. ఫ్లైఓవర్లు కూడా కడతాం. పరిపాలనా రాజధానిలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తాం.

ప్ర: భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ హామీ ఏమైంది?

జ: రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరుచేసింది. సీఎం జగన్ శంకుస్థాపన కూడా చేశారు. టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి.

ప్ర: మీకు కోపం ఎక్కువట?

జ: నియోజకవర్గంలో ప్రతి కుటుంబంతో పరిచయం ఉంది. అవంతి దగ్గరకు వెళితే ఇబ్బంది పెట్టకుండా సమస్య తెలుసుకొని సాయం చేస్తారనే పేరు ఉంది. దైవభక్తి, పాపభీతి ఉన్నాయి. నిజాయితీగా ఉంటాను కాబట్టే కోపం వస్తుంది. అది ఆ కొద్దిసేపే. జీవితం అనేది రంగస్థలం లాంటిది. ఎవరి పాత్ర వారు పోషించి వెళ్లిపోవలసిందే.

ప్ర: మళ్లీ పోటీ చేయడానికి కారణం?

జ: భగవంతుడు ఆశించిన దాని కంటే ఎక్కువే ఇచ్చాడు. పదవులు అడ్డం పెట్టుకొని మరింత సంపాదించాలనే యావ లేదు. శక్తి మేరకు ప్రజలకు సేవ చేయాలనేది సంకల్పం. ఐదు లక్షల మందికి విద్యాబుద్ధులు నేర్పించాం. వేలాది మందికి ఉపాధి కల్పించా. తల్లిదండ్రుల తరువాత అధికంగా ఇష్టపడేది భీమిలినే. నియోజకవర్గమే నాకు దేవాలయం. మానవ సేవే..మాధవ సేవ. అందుకే మళ్లీ పోటీ.

ప్ర: మిత్రుడు గంటాతో పోటీపై మీ అభిప్రాయం?

జ: ముందు నుంచి భీమిలిలో నేనే ఉన్నా. 2009లో గెలిచా. 2014లో నన్ను ఎంపీగా పంపించి ఆయన పోటీ చేసి గెలిచారు. 2019లో మళ్లీ నేనే భీమిలిలో విజయం సాధించా. ఈసారి కూడా జగన్ నాకు టికెట్ ఇచ్చారు. గంటా తన సెంటిమెంట్ ప్రకారం ఇక్కడ పోటీ చేయకూడదు. కానీ ఆయన ఏరికోరి ఇక్కడే పోటీకి వచ్చారు. అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. ఇద్దరం మిత్రులమే. అయినా పోటీ తప్పలేదు.

నేడే కూటమి సభ

... 3వ పేజీ తరువాయి

రోడ్డును పూర్తిగా వాహనాల రాకపోకలకు వినియోగించేలా ఏర్పాట్లు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను విశాఖ డీఐజీ విశాల్‌గున్నీ, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. మోదీ, చంద్రబాబుల కోసం మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి 3.40 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.50కు విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4కు కశింకోట మండలం ఉగ్గినపాలెంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సాయంత్రం చేరుకుంటారు. 4.40కు ఉగ్గినపాలెం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి తాళ్లపాలెం సభా వేదిక వద్దకు ఐదు గంటలకు చేరుకుంటారు. సభ అనంతరం 6.40కు రోడ్డు మార్గంలో విశాఖ చేరుకొంటారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న అవంతి శ్రీనివాసరావు


గంటా సమక్షంలో టీడీపీలో చేరిన పద్మనాభం మండలానికి చెందిన వైసీపీ శ్రేణులు


గంటా సమక్షంలో టీడీపీలో చేరిన 98వ వార్డు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి

కొమ్మాది, మే 5 : అధికారం కోసం ప్రతిపక్షాలు చెప్పే మాయ మాటలు నమ్మొద్దని భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పింఛన్‌దారుల ఇబ్బందులకు చంద్రబాబునాయుడు కారణమని ఆరోపించారు. ఆదివారం పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీ వరకు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు.వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ పరిపాలనా రాజధాని అవుతుందని, తద్వారా ఉత్తరాంధ్ర అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్ అమలు చేస్తున్న పథకాలను చూసి ఏపీ మరో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు, అంతకంటే ఎక్కువ హామీలు ఇచ్చారని, వాటిని ఎలా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఈసారి తనకు గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలంటే వైసీపీ రావాలని, పుట్టిన ప్రాంతానికి మేలు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. భీమిలికి ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రెడీమేడ్ నాయకులు వస్తున్నారని, ఎన్నికల తర్వాత గంటా ఈ ప్రాంతంలో కనిపించరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోతన హనుమంతురావు, జేఎస్ రెడ్డి, సుజాత, మహాలక్ష్మినాయుడు, పాల్గొన్నారు.


ప్రచార వాహనంపై ముత్తంశెట్టి, బొత్స ఝాన్సీ

వైసీపీలో పలువురి చేరిక

భీమునిపట్నం : పద్మనాభం మండలం తునివలస, అనంతవరం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన క్యాంప్ కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. దీంతో పార్టీలోకి చేరికలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు అప్పలరాజు, కశిరెడ్డి సురేష్, సబ్బవరపు రామారావు, జడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, నాయకులు కోరాడ లక్ష్మణ, పాల్గొన్నారు.


ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ముత్తంశెట్టికి దిష్టి తీస్తున్న మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు

చంద్రబాబుతోనే సుపరిపాలన

భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, మే 5 : వైసీపీ విధ్వంస పాలనతో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని, రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన గంభీరం, ముకుందపురం, బోని, సిర్లపాలెం, వీకేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా బోని గ్రామంలో 130 ఎకరాలు, శిర్లలో 40 ఎకరాలకు సాగుహక్కు మాత్రమే ఇచ్చి భూయాజమాన్య హక్కులు కల్పించకపోవడం వల్ల స్థిరాస్తి ఉన్నా పిల్లల పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గంటా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బోనిలో గోస్తనీ నది నుంచి 280 ఎకరాలు ముకుందరాజు చెరువుకు అర కిలోమీటరు దూరంలో ఉండడంతో రూ. 6 కోట్లతో ఎత్తిపోతల పథకం పెట్టగా తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. బోని గ్రామంలో 570 ఎకరాలు మాన్యాస్ సెటిల్‌మెంట్ జరగాల్సి ఉందన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు తప్ప కొత్తగా చేపట్టిన పనులు కనిపించడం లేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక వీకేరు నుంచి అనంతవరం వరకు రోడ్డు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


గంటాకు పూలు చల్లి, హారతులు పడుతున్న మహిళలు

టీడీపీలో పలువురి చేరిక

భీమునిపట్నం : నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో గంటా శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపు ఖాయమని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పార్టీలో చేరి విజయానికి శ్రమించిన వారందరికీ అధికారంలోకి వచ్చిన తర్వాత తగిన గుర్తింపు వుంటుందన్నారు. కాగా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ రఘుమజ్జి వెంకటరావు, కొవ్వాడ భారతి, రఘుమజ్జి అప్పలరాజు, ఆర్. బంగారునాయుడు, అదే మండలం అయినాడ గ్రామానికి చెందిన పూసర్ల సూర్యనారాయణ, దువ్వ శంకర్, పిన్నింటి రాజబాబు, నీలారి రమణ, దువ్వ శివ, పూసర్ల ఆదిబాబు, దువ్వ శ్రీను, నవీన్, పిన్నింటి జగదీష్ టీడీపీలో చేరారు. అలాగే మధురవాడ ధర్మపురి కాలనీ అధ్యక్షురాలు, జిల్లా వెలమ సంఘం నాయకురాలు అమ్మాజీ, పద్మనాభం విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వేము అప్పలాచారి, ఉపాధ్యక్షుడు వేము ఈశ్వరరావు వారి అనుచరులు చేరారు. 98వ వార్డు కార్పొరేటర్ పిసిని నరసింహారావు ఆధ్వర్యంలో బంతి ఈశ్వరరావు, గనిరెడ్డి జ్ఞానేశ్వరరావు, నేమాలి లోకేష్, కాంద్రేగుల ఉమా మహేష్, దమ్ము అప్పలరాజు, చైతన్య రెడ్డి, గౌరీ శంకర్ టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, నాయకులు అక్కరమాని వెంకటరావు, మాజీ ఎంపీపీ గోపిబాబు, నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కె. రామానాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు

ఎండాడ/మధురవాడ : వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ అన్నారు. ఆదివారం ఆయన 8వ వార్డులోని వరహగిరినగర్, ఎండాడ గ్రామం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న నిరాశ, నిస్పృహలు తొలగాలంటే పాలనా సామర్థ్యం ఉన్న, అనుభవజ్ఞుడైన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాగా 8వ వార్డులోని ముసలయ్యపాలెంకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కె.గోపి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి రవితేజ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఏడో వార్డులోని స్వతంత్రనగర్ కాలనీలో కూడా గంటా రవితేజ ప్రచారం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెలగపూడి రామకృష్ణబాబు


బీచ్ రోడ్డులో ప్రచారం చేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు, పట్టాభిరామ్

పెదజాలారిపేటను కాపాడుకుందాం

తూర్పు కూటమి అభ్యర్థి వెలగపూడి

పెదవాల్తేరు, మే 5 : వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని తూర్పు కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి పెదజాలారిపేట తీరంలో 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. పెదజాలారిపేట భూములను రాజుల పేరు చెప్పి రూ. 2500 కోట్ల దొడ్డి దారిన వైసీపీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. మత్స్యకారులంతా తమ భూములను ఆస్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సోదరుడు సిద్దార్థ, అక్కరమాని వెంకట్రావు, టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, తేడ్డు రాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయన ఉడా పార్కు, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, తదితరులు పాల్గొన్నారు.


ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న సుజన

సిరిపురం : కూటమితోనే తూర్పు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఆయన బీచ్ రోడ్డులో ప్రచారం చేశారు. వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. తనకు మరో అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి వెలగపూడిని నాలుగోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : వెలగపూడి రామకృష్ణబాబును నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి సుజన కోరారు. ఎంవీపీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలగపూడిని మూడుసార్లు గెలిపించడం ద్వారా తూర్పు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఆయన ముందుంటారని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

వెంకోజీపాలెం/ఆరిలోవ : వెలగపూడిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్ కోరారు. ఆదివారం వారు వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. అలాగే చినగదిలి సాయిబాబా గుడి నుంచి సాలిపేట వరకు 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో వెలగపూడికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.

నూతన వైద్య విధానాలపై నేత్ర వైద్యులకు అవగాహన

ఎండాడ, మే 5 : నేత్ర చికిత్సా విధానంలో గ్లకోమా, కేటరాక్ట్ చికిత్సలో నూతన వైద్య విధానాలపై అవగాహన కోసం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్‌సర్)లో నేత్ర వైద్య విభాగం, ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరి జిల్లాలకు చెందిన 250 మంది వైద్య విద్యార్థులు, వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నేత్ర వైద్యులు గ్లకోమా, కేటరాక్ట్ చికిత్సలో నూతన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ ఆసుపత్రి డీన్ డాక్టర్ ఎస్వీ రావు, ఏపీ ఆప్తాల్మిక్ సొసైటీ అధ్యక్షుడు, జిమ్‌సర్ నేత్ర వైద్య విభాగం అధిపతి డాక్టర్ వీవీఎల్ నరసింహరావు, కార్యవర్గ సభ్యులు సీవీ గోపాలరాజు, కేవీవీ సత్యనారాయణ, మధు ఉద్దరాజు, జీఆర్ రెడ్డి, చంద్రశేఖర్, మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ పద్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొన్ని సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో సోమరితనం

ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి


గరికిపాటిని సన్మానించిన షి షోర్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు

పెదవాల్తేరు, మే 5 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో సోమరితనం వస్తుందని ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. ఉడా పార్కులో షి షోర్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్ని, సుఖాన్ని సమానంగా స్వీకరించాలన్నారు. ఉన్నది చాలు అనుకోవడమే వైరాగ్యం. వైరాగ్యం కలిగి ఉంటే వైకుంఠం మన వెంట ఉన్నట్టేనన్నారు. అనంతరం నిర్వాహకులు గరికిపాటిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో షి షోర్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీ జి. తిరుపతిరావు, కోశాధికారి ఎంఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 22, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబటి 32, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 30, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 46, కీరదోస 30, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	125
ఫారం ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



చినవాల్తేరులోని మునిసిబ్ వీధిలో జరిగిన సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అన్ని వర్గాలకు సమ న్యాయం

- తూర్పు వైసీపీ అభ్యర్థి ఎంవీవీ
- క్రైస్తవులతో ఆత్మీయ సమావేశం

వెంకోజీపాలెం, మే 5 : అన్ని సామాజిక వర్గాలకు తమ ప్రభుత్వం సమ న్యాయం చేసిందని, పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో క్రైస్తవులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా.. పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. వైసీపీని గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ జగన్ ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చారన్నారు. నవరత్నాలతో గడప ముంగిటికే సంక్షేమ పథకాలను తీసుకు వచ్చిన జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

పెదవాల్తేరు : జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరులోని మునిసిబ్ వీధిలో గణపతి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎంవీవీ సత్యనారాయణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లల్లో ముఖ్యమంత్రి జగన్ మహిళలను లక్షాధికారి చేశారన్నారు. రాష్ట్రంలో అన్ని సామాజికవర్గాలకు సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. వెలగపూడి మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసినా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్, మద్ది వెంకటరమణ, రామిరెడ్డి, మల్లికార్జున, రమణమ్మ, పాల్గొన్నారు.


ఎండాడలోని మిరాకిల్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎంవీవీ సత్యనారాయణ

ఎండాడ/ఆరిలోవ : ఎండాడలోని మిరాకిల్ సెంటర్ (చర్చ్)లో ఎంవీవీ సత్యనారాయణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ శామ్యూల్ కర్నోజీ ఆయనకు క్రీస్తు దీవెనలు అందించారు. అనంతరం ఆయన మిరాకిల్ సెంటర్ సభ్యులతో మాట్లాడి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆరిలోవలోని పలు చర్చిల్లోనూ ఎంవీవీ ప్రార్థనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తేజస్విని

స్టీల్‌ప్లాంటు కోసం శ్రీభరత్ పోరాడతారు

విశాఖ ఎంపీ అభ్యర్థి సతీమణి తేజస్విని

గాజువాక, మే 5 : కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ఉక్కు కర్మాగారం కోసం పోరాడతారని ఆయన సతీమణి తేజస్విని అన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు సమర్థవంతమైన నాయకత్వం చాలా అవసరమని, శ్రీభరత్ అయితే ఉక్కు కర్మాగారాన్ని కాపాడుతారన్నారు. అగనంపూడిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఎంపీలు ఎంవీవీఎస్.మూర్తి, ఎర్రన్నాయుడు స్టీల్‌ప్లాంటును కాపాడారని, ఇప్పుడు అదే బాధ్యతను శ్రీభరత్ తీసుకుంటారన్నారు. రాష్ట్రం బాగుండడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం తాను ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడ్డానన్నారు. కార్యక్రమంలో జనసేన గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, మే 5 : సింహగిరిపై ఈనెల 8 నుంచి 13 వరకు విశిష్టాద్వైత మత ప్రచారకుడు భగవద్రామానుజాచార్యులు తిరు నక్షత్ర పూజలు నిర్వహించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేష సేవాకాలం, ప్రత్యేక ఉత్సవాలు జరగాల్సి ఉన్నందున ఈనెల 8, 11, 12 తేదీల్లో భక్తులకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయన్నారు. అలాగే 13న చక్రవర్తి తిరుమగన్ తిరు నక్షత్రం (శ్రీవైష్ణవ శ్రీరామనవమి) సందర్భంగా సాయంత్రం 5 గంటలకు హనుమత్ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవాల దృష్ట్యా ఈనెల 8 నుంచి 13 వరకు అప్పన్న ఆలయంలో అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, మే 5 : మండలంలోని మునివానిపాలెం, సామయ్యవలస గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సభ్యులు ప్రబోధానంద రాసిన గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయరాంపురం హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు సురేష్, పైడన్న, అచ్చియ్యమ్మ, సంతోషి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహచలం, మే 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆదివారం నుంచి ఆర్జిత సేవలను పునఃప్రారంభించారు. స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని గత నెల 18 నుంచి ఆర్జిత సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆర్జిత సేవల పునఃప్రారంభంలో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన చేశారు.అలాగే గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చన చేశారు.

రెండో రోజు 45 కిలోల చందనం అరగదీత

సింహచలం, మే 5 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించనున్న శ్రీచందనాన్ని రెండో రోజు 45 కిలోలు అరగదీశారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవల అనంతరం నాలుగో తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించి, మధ్యాహ్నం 11.30 గంటలకు ముగించారు. అరగ దీసిన శ్రీచందనం ముద్దను దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు. రెండు రోజుల్లో ఇప్పటి వరకు 80 కిలోల చందనాన్ని అరగదీశారు.



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

ఆస్తి మీదే... హక్కులు ఎవరివైనా కావచ్చు




విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్...ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్న పదం. ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న చట్టం. వైసీపీ ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న ఈ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2024) అన్నివర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. అసలు ఈ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినప్పుడే న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తంచేశారు. వేర్వేరు రూపాల్లో తమ నిరసన తెలియజేశారు. ఈ యాక్ట్ అమలులోకి వస్తే అనేక రకాల ఇబ్బందులు ఉంటాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజల స్థిరాస్తులపై చట్టబద్ధమైన హక్కులను ప్రభుత్వం నియమించే వ్యక్తుల చేతిలో పెట్టే అవకాశాన్ని ఈ యాక్ట్ కల్పిస్తోందన్న భావనను వ్యక్తపరుస్తున్నారు. దీనివల్ల స్థిరాస్తులు, వివాదాస్పద భూములు, స్థలాలకు సంబంధించిన వ్యవహారాల్లో రాజకీయ జోక్యానికి ఆస్కారాన్ని కల్పించినట్టు అవుతుందని, తద్వారా అధికారంలో ఉన్న పార్టీ నేతలు చెప్పిన వారికి మేలు జరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ యాక్టును వైసీపీ ప్రభుత్వం సమర్థించుకుంటుండగా, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు ప్రకటించారు. ఈ యాక్ట్‌పై న్యాయవాదులు ఏమంటున్నారో చూద్దాం...

భూమి హక్కుదారులకు అనేక రకాల ఇబ్బందులు

- తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని టీడీపీ, జనసేన ప్రకటన
- డిఫెన్స్‌లో పడిన వైసీపీ ప్రభుత్వం
- ఈ నిర్ణయాన్ని ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తున్న న్యాయవాదులు

ఆస్తి యజమానులకు నష్టాన్ని చేకూర్చే నిర్ణయం



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ యాక్ట్ అమలులోకి వస్తే ప్రభుత్వం నియమించే వ్యక్తుల ఆధ్వర్యంలో సమస్యలను క్లియర్ చేస్తామని చెబుతున్నారు. దీనివల్ల రాజకీయ జోక్యానికి, లంచాలకు, అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది. న్యాయ అవ గాహన లేని వారితో ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. ఎకరా, అర ఎకరా భూములు ఉన్న సాధారణ రైతులకు ఈ యాక్ట్‌తో పెను ప్రమాదమే. జిల్లా కోర్టులో, ట్రిబ్యునల్స్‌లో అప్పీల్ చేయడానికి అవకాశం ఉండదు. అలాగే రైతు తన భూమిని మరొకరు వివాదంలోకి లాగిన విషయాన్ని రెండేళ్లలో తెలుసుకోలేకపోతే పెద్ద నష్టమే కలుగుతుంది. రిజిస్ట్రేషన్లను ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జనరల్ లిమిటేషన్ యాక్ట్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్‌కు పూర్తి విరుద్ధం. ఇందులో ఎన్ని సెక్షన్లు నిలబడతాయో కూడా చెప్పలేం. ఈ యాక్ట్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఇది ఆస్తి యజమానులకు నష్టాన్ని చేకూర్చే నిర్ణయం.

- కేవీ రామమూర్తి, న్యాయవాది, విశాఖపట్నం

కబ్జాదారుల చేతుల్లో భూములు పెట్టే యాక్ట్



ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే చట్టం ఇది. ఈ యాక్ట్ అమలులోకి వస్తే సాధారణ ప్రజల ఆస్తులకు ఇబ్బందులు తప్పవు. రెవెన్యూలో అవినీతిని ప్రోత్సహించేందుకు ఈ యాక్ట్ దోహదం చేస్తుంది. ఉదాహరణకు రెండు ఎకరాల భూ యజమాని ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకుంటూ ఉంటాడు. ఐదేళ్లకో, పదేళ్లకో ఊరు వస్తుంటాడు. అతని భూమిని ఎవరైనా కబ్జా చేసి తన పేరు మీద టైటిల్ రాయించుకున్నాడనుకోండి. ఈ విషయం ఎక్కడో ఉన్న యజమానికి రెండేళ్ల వరకు తెలియకపోతే...దానిపై అతను హక్కును కోల్పోయే ప్రమాదముంది. ఈ తరహా ఇబ్బందులు పరిష్కారానికి ఇప్పటివరకు కింది స్థాయి కోర్టులకు వెళ్లేఅవకాశం లభించేది. ఇప్పుడు ఆ అవకాశమే లేదు. నేరుగా హైకోర్టుకు మాత్రమే వెళ్లాలి. పూర్తి అధికారాలను టైటిలింగ్ ఆఫీసర్ చేతిలో పెట్టడం వల్ల అవినీతిని ప్రోత్సహించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే కబ్జాదారుల చేతుల్లోకి భూములను తీసుకువెళ్లి పెట్టేందుకు మార్గాన్ని యాక్ట్ ద్వారా కల్పిస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన చట్టం.

- జీవీఏ సాయిబాబా, న్యాయవాది, విశాఖపట్నం

న్యాయాన్ని నిరుపేదలకు దూరం చేసే యాక్ట్



భూ సంబంధిత సమస్యల్లో న్యాయాన్ని నిరుపేదలకు దూరం చేసేలా ఈ యాక్ట్ చేస్తోంది. ఇప్పటివరకు భూములకు సంబంధించిన వివాదాలపై తీర్పులను సీనియర్లు అయిన న్యాయవాదులు ఇస్తున్నారు. వీరికి ఎంతో అనుభవం, ఎంతో శిక్షణ ఉంటాయి. తాజాగా తెచ్చిన యాక్ట్ వల్ల ప్రభుత్వం నియమించిన వ్యక్తులకు అధికారాన్ని కట్టబెట్టడం వల్ల రాజకీయ ప్రమేయాన్ని పెంచేందుకు అవకాశం ఉంది. యాజమాన్య హక్కులను నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వం నియమించే వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని చోట్ల కావాలనే వివాదాలు సృష్టించే వ్యక్తులు ఉంటారు. దీనివల్ల అవసరార్థం ఆస్తులను అమ్ముకునే వారికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ కొరవడే ప్రమాదం ఉంది.

- నాదెండ్ల వెంకట సుమన్, సీనియర్ న్యాయవాది, విశాఖ బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్

భూ యజమానులను ఇబ్బందులకు గురి చేసే చట్టం



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. దీనివల్ల భూ యజమానుల నష్టపోయే ప్రమాదం ఉంది. వివాదాలను క్లియర్ చేయించుకోవడానికి లంచాలు ఇవ్వాల్సి రావచ్చు. కొన్నిసార్లు రాజకీయ నాయకుల ప్రమేయంతో అసలు యజమానులకు బదులు... ఎవరికైనా వాటిపైనా హక్కులు దక్కే ప్రమాదం ఉంది. ఉన్నత స్థానంలో అప్పీల్ చేసుకోవడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అత్యవసర సమయాల్లో ఆస్తులు అమ్మడానికి అవకాశం ఉండదు. క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం టైటిలింగ్ పర్సన్ చుట్టూ తిరగాల్సి రావచ్చు. న్యాయ పరిజ్ఞానం లేని వ్యక్తులకు టైటిలింగ్ పర్సన్ అధికారాలు ఇస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవడం ద్వారా మాత్రమే ప్రజలకు మేలు కలుగుతుంది.

- డి.నరేష్ కుమార్, ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

సామాన్యుల భూములకు రక్షణ కరవు



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది చాలా ప్రమాదకరమైన చట్టం. ఈ చట్టం అమల్లోకి వస్తే పేదల భూములకు రక్షణ లేకుండా పోతుంది. డబ్బు, పలుకుబడి ఉన్నవారికే ఈ చట్టం ఉపయోగపడుతుంది. పేదలు తమ భూములను కాపాడుకోవడం తలకు మించిన భారమే. అయాక్టు అంత ప్రమాదకరంగా ఉండడం వల్లే, దీనికి వ్యతిరేకంగా న్యాయవాదులందరూ ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకంగా పోరాటం చేశాం. ఇప్పటికీ పోరాటం చేస్తున్నాం. ఈ చట్టం వల్ల భూములకు పూర్తి రక్షణ కలుగుతుందని వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఈ చట్టం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి.

- గూనూరు లక్ష్మీనారాయణ, న్యాయవాది, చోడవరం

దుర్మార్గమైన చట్టం



వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కరవవుతుంది. ఆ యాక్టును అనుసరించి ఇప్పటికే రాష్ట్రంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రైతులకు నష్టం కలిగించే విధంగా రీ సర్వే పేరుతో పెద్దఎత్తున దోపిడీ జరుగుతుంది. రైతాంగం వారికి జరిగిన అన్యాయం గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియని మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు జరిగితే తీవ్రంగా నష్టపోయేది చిన్న, సన్నకారు రైతులే. వారి హక్కును నిర్ధారించుకునేలోపే రికార్డు రూపంగా మరొకరికి ఆస్తి బదిలీ అయిపోతుంది. ఇది దుర్మార్గమైన చట్టం. ఈ చట్టాన్ని రద్దు చేయాలి.

- ఇల్లా అవినాష్, న్యాయవాది, అనకాపల్లి

చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బంది



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వ్ల చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడతారు. ఏదైనా భూ సమస్య వస్తే ల్యాండ్ టైటిలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి తప్పితే కోర్టుకు వెళ్లడానికి వీలు లేదు. అడంగల్, 1-బి రికార్డులు ఉండవు. టైటిల్ ఒక్కటే ఉంటుంది. అత్యవసరంగా భూములు అమ్ముకోవాలన్నా, తనఖా పెట్టాలన్నా అధికారులు అనుమతి తీసుకోవల్సి ఉంటుంది.

-కామిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది, నర్సీపట్నం

యాక్ట్ వల్ల కలిగే నష్టాలపై పుస్తకం రాశా



ఈ యాక్ట్ వల్ల తీవ్ర నష్టం కలుగుతుంది. పూర్తిగా సివిల్ కోర్టులకు వెళ్లడానికి లేకుండా చేశారు. ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ వద్దే ప్రతి సమస్య పరిష్కరించుకోవాలి. మూడు రకాల రిజిస్టర్లు టైటిలింగ్ ఆఫీసర్ దగ్గరే ఉంటాయి. అందులో ఒకటి వివాద రిజిస్టర్ ఉంటుంది. అక్కడే తేల్చుకోవాల్సి ఉంటుంది. వివాదం అంటే ఏమిటో, టైటిల్ అంటే ఏమిటో చెప్పలేదు. అగ్రిమెంట్‌లు అంటే ఏమిటో స్పష్టత లేదు. ఈ యాక్ట్ వల్ల జరిగే నష్టాలు ఏమిటో ప్రజలకు తెలియజేసేం దుకు నా భూమి, నా హక్కు, నా ఇష్టం పేరుతో పుస్తకాన్ని కూడా రాశాను.

- పతివాడ గిరిధర్, న్యాయవాది, విశాఖపట్నం



రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలి



రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలుపై స్పష్టమైన హామీలు ఇచ్చే పార్టీకే ఓటు వేయాలి. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, ఓపీఎస్ పునరుద్ధరణ, ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థులను గెలిపించాలి. హామీలను సమర్థంగా అమలుచేయ గల సత్తా నేతలను ఎన్నుకుంటేనే భవిష్యత్తు. పథకాల పేరుతో జనాన్ని సోమరులుగా మార్చే వారిని తరిమికొట్టాలి. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటువేయాలి.

- మామిడి ఉపేంద్ర, గాజువాక

పరిశ్రమలను ప్రోత్సహించాలి



రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్య తీరుతుంది. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసినట్టు అవుతుంది. స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యువత చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి మరింతమందికి ఉపాధి కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుతో వలసలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచనలున్న పార్టీలు, నేతలను ఎన్నుకుంటే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుంది.

- అర్జిల్లి దాసు, ఎంవీపీ కాలనీ

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుం టున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

సామాజిక మాధ్యమం హోరెత్తుతున్న ప్రచారం

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు వినియోగం

- ప్రత్యేకంగా బృందాలను నియమించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు.. భారీగా ఖర్చు
- వేలాది గ్రూపులు... లక్షలాది కాంటాక్టులు
- నిత్యం వందల్లో పోస్టింగ్‌లు
- ఏ విషయమైనా నిమిషాల్లో అప్‌లోడ్
- చర్చలు, లైక్‌లు, విమర్శలకు అదే వేదిక
- పెరిగిన ఆకర్షణ... తగ్గిన విశ్వసనీయత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారానికి ఒకప్పుడు పార్టీ జెండాలు, బ్యానర్లు, బ్యాడ్జీలు, కరపత్రాలు, ప్రచార రథాలే ఆధారం. ఇందుకోసం రూ.లక్షల్లో ఖర్చు చేసేవారు. కాలంతోపాటు ట్రెండ్ మారింది. సామాజిక మాధ్యమాలు వచ్చాక ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునేందుకు టెక్నాలజీయే ముఖ్యమైంది. ప్రస్తుతం ప్రధాన పార్టీలు ఒకవైపు సంప్రదాయ రీతిలో...మరోవైపు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఓటరుకు ఎందులో ఖాతా ఉన్నా విడిచిపెట్టడం లేదు. ట్విటర్ (ఎక్స్) మొదలు ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలీగ్రామ్, వాట్సాప్...ఇలా ఏ అకౌంట్ ఉన్నా అందులో మెసేజీల మోత మోగుతోంది. గత ఎన్నికల్లో అంతంత మాత్రంగా ఉన్న సామాజిక మాధ్యమాల ప్రభావం ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఇందుకు కారణం మారుమూల పల్లెల్లోనూ స్మార్ట్ ఫోన్లు పెరగడమే.



ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్

నూటికి 95 శాతం మంది చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. టచ్ స్ర్కీన్ ఫోన్లలోనే కాకుండా బేసిక్ మోడళ్లలోనూ వాట్సాప్, ఫేస్‌బుక్ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాక ప్రతి ఒక్కరికీ ఈ అకౌంట్లు సాధారణంగా మారాయి. ఇంగ్లీషు రాని వాళ్లు సైతం వీటిని ఆపరేట్ చేస్తున్నారు. వీటికితోడు ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో సామాజిక మాధ్యమాలు వీక్షించే వారి సంఖ్య భారీగా ఉంది. దీనిని రాజకీయ పార్టీల అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు. తమ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల ఫోన్ నంబర్లు, ఇతర సామాజిక మాధ్యమాల అకౌంట్లను తెలుసుకుని...వారికి తాము చెప్పాలనుకుంటున్న విషయాన్ని చేరవేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రూపులు, కమ్యూనిటీలు ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని విభిన్నంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను కూడా నియమించుకుంటున్నారు. ఈ బృందాలు సదరు అభ్యర్థులకు సంబంధించిన బలాబలాలు, చేసిన మంచి, అభివృద్ధి వంటి అంశాలతో కూడిన పాయింట్లు, విజువల్స్‌తో కూడిన వీడియోలు రూపొందించి పోస్ట్ చేస్తున్నాయి.

వేలాది కాంటాక్ట్‌లు

ఒక్కొక్కరూ వేలాది కాంటాక్ట్‌లతో అనుసంధానమై ఉంటున్నారు. ఇది ప్రచారానికి ఎంతో ఉపయుక్తమవుతోంది. ఉదయం నెట్ ఆన్ చేయగానే వందల్లో, వేలల్లో పొలిటికల్ మెసేజీలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానంగా పార్టీల్లో యాక్టివ్‌గా ఉన్న కార్యకర్తలు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేస్తూ ప్రచారాలను, తమ బలాలను, ప్రత్యర్థుల బలహీనతలను వాటిలో పోస్ట్ చేస్తున్నారు. ఇక ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, టెలీగ్రామ్‌లలో ఫాలోవర్స్ అధికంగా ఉన్న నాయకులు వాటి వేదికగా అప్ టు డేట్ సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నారు. కార్యకర్తల సమావేశాలు, ఒకరిపై మరొకరి ఫిర్యాదులు, ఆరోపణలు, ప్రచారాలు క్షణాల్లో ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. వాట్సాప్‌లలో సుమారు 5 వేల మంది ఒక గ్రూపుగా చేర్చుకునే వీలుంది. ఒక కార్యకర్త వద్ద అన్ని కాంటాక్టులతో ఒక గ్రూపును క్రియేట్ చేసి దాని ద్వారా అన్ని విషయాలు షేర్ చేస్తున్నారు.

లైక్‌లు.. సర్వేలు

ఒకే విషయాన్ని పదేపదే చెబితే అబద్ధమైనా నిజమనే నమ్మే పరిస్థితి ఎదురవుతుంది. సామాజిక మాధ్యమాలు ఇప్పుడు అందుకు వేదికవుతున్నాయి. ఎదుటి పార్టీని అప్రతిష్ట పాల్జేసేందుకు ఒకే విషయాన్ని పలు కోణాల్లో పదేపదే ప్రచారం చేస్తూ ఒప్పులను తప్పులుగా, తప్పులను ఒప్పులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోంది. ఒక తప్పుడు సమాచారాన్ని అనుచరులే వందల్లో లైక్‌లు కొట్టి వాటి విశ్వసనీయతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలపై బలవంతంగా తమ అభిప్రాయాలు రుద్దే ప్రయత్నం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న వాటిలో వాస్తవమెంత? అన్న విషయాన్ని రూఢీ చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, వాటిని గుడ్డిగా విశ్వసించడానికి వీల్లేదని మేధావులు స్పష్టం చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో అభ్యర్థి కనీసం వంద మంది వరకు యువతను ఎన్నికల కోసం నియమించుకున్నారు. వీరు ఎన్నికలు పూర్తయ్యేంత సదరు పార్టీ నేత చేసే కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తుంటారు. ఇందుకోసం భారీ మొత్తాన్ని అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారు. సోషల్ మీడియా టీమ్‌లను నియమించే బాధ్యతను పలు సంస్థలు చూస్తుండడం గమనార్హం.

నచ్చిన రీతిలో ప్రచారం


సామాజిక మాధ్యమాల్లో సమాచారం వెర్రితలలు వేయడం మొదలయ్యాక విశ్వసనీయత తగ్గిపోయింది. ఏది నిజమో?, ఏది అబద్ధమో తెలియని అయోమయ స్థితిలోకి ఓటర్లను నెట్టేస్తోంది. రాజకీయ పార్టీలు తమ పార్టీకి అనుకూలంగా పోస్టులు పెట్టే క్రమంలో పనిగట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నాయి. ఈ తరహా ప్రచారం విషయంలో ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

పశ్చిమలో గెలుపెవరిదో?

- నియోజకవర్గం ఏర్పాటైన తరువాత మూడుసార్లు ఎన్నికలు
- తొలిసారి కాంగ్రెస్ పార్టీ, రెండుసార్లు టీడీపీ విజయం
- ఈసారి టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ మధ్య ప్రధాన పోటీ

నియోజకవర్గంలోని మండలాలు:	గోపాలపట్నం, గాజువాక, ములగాడ
నియోజకవర్గం ఓటర్లు:	2,13,439
పురుషులు	1,05,202,
స్త్రీలు	1,08,226
ఇతరులు	11 మంది

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా 2008లో ఏర్పడింది. అంతకుముందు ఈ ప్రాంతం పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఉండేది. పశ్చిమ నియోజక వర్గం ఏర్పాటైన తరువాత ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపొందారు.



గణబాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి



ఆడారి ఆనంద్‌కుమార్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం మధ్య ముక్కోణపు పోటీ జరిగింది. పెందుర్తి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పెతకంశెట్టి గణబాబుకు కాకుండా 2004 ఎన్నికల్లో మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు సతీమణి నాగమణికి టీడీపీ టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఐదేళ్ల పాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న గణబాబు 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మళ్ల విజయప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుంచి గుడివాడ నాగమణి పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మళ్ల విజయప్రసాద్ ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి గణబాబుపై సుమారు రెండు వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరిన గణబాబు 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున బరిలో దిగారు. అదే సమయంలో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మళ్ల విజయప్రసాద్‌ను కాకుండా దాడి రత్నాకర్‌కు టికెట్ కేటాయించింది. వైసీపీ అభ్యర్థి దాడి రత్నాకర్‌పై టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు సుమారు 18 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి మళ్ల విజయప్రసాద్ మళ్లీ బరిలోకి దిగారు. తెలుగుదేశం పార్టీ నుంచి మారోమారు గణబాబు పోటీ చేసి మళ్ల విజయప్రసాద్‌పై సుమారు 16 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనంద్‌కుమార్‌ల మధ్య ప్రధాన పోటీ జరుగుతుంది. ఈసారి గణబాబు విజయం సాధిస్తే హ్యాట్రిక్ సాధించినట్టవుతుంది. అదే ఆడారి ఆనందకుమార్ విజయం సాధిస్తే నియోజకవర్గంలో తొలిసారి వైసీపీ జెండా ఎగురుతుంది. టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య జరుగుతున్న రసవత్తరమైన పోరులో నియోజకవర్గ ప్రజలు ఈసారి ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే. ● గోపాలపట్నం

తీరంలో క్రీడా వినోదం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అతని సతీమణి తేజస్విని ఆర్కేబీచ్‌లో వాలీబాల్ ఆడారు. వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం గాదిరాజు ప్యాలెస్‌లో రాజస్థానీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ నటి, బీజేపీ నాయకురాలు నమిత శ్రీభరత్‌ను ఘనంగా సత్కరించారు. - ఎంవీపీ కాలనీ



శ్రీభరత్‌ను సత్కరిస్తున్న సినీ నటి, బీజేపీ నేత నమిత